మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...


PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక www.evarthalu.com


మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..


శుక్రవారం FRIDAY 24-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 295 Issue: 295

Published from Jagitial
Circulated to Telangana


24 ఏప్రిల్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:58 సూర్యాస్తమయం - సా. 6:30 తిథి అష్టమి రా. 7:27 వరకు తరువాత నవమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం పుష్యమి రా. 8:16 వరకు తరువాత ఆశ్లేష యోగం శూల రా. 1:24౦ వరకు కరణం విష్టి ఉ. 8:03 వరకు బవ రా. 7:27 వరకు వర్జ్యం తె. 4:43 నుండి ఉ. 6:16 వరకు దుర్ముహూర్తం ఉ. 8:28 నుండి ఉ. 9:18 వరకు మ. 12:39 నుండి మ. 1:29 వరకు రాహుకాలం ఉ. 10:40 నుండి మ. 12:14 వరకు యమగండం మ. 3:22 నుండి సా. 4:56 వరకు గుళికాకాలం ఉ. 7:32 నుండి ఉ. 9:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:22 నుండి తె. 5:10 వరకు అమృత ఘడియలు మ. 2:01 నుండి మ. 3:34 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:39 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Pay

## వాట్సాప్‌లోనే మొబైల్ రీచార్జ్

### ఏ నెట్‌వర్క్ అయినా ఈజీ పేమెంట్లు

ప్రముఖ సోషల్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ మరో కొత్త సదుపాయాన్ని తీసుకొచ్చింది. భారత్‌లోని తమ యూజర్లు వాట్సాప్ యాప్‌లోనే మొబైల్ ప్రీపెయిడ్ రీచార్జ్ చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది.

న్యూఢిల్లీ: ఈ సదుపాయాన్ని అందించేందుకు పేయూతో వాట్సాప్ జతకట్టింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ మొబైల్ యూజర్లకు ఈ కొత్త ఫీచర్ దశల వారీగా అందుబాటులోకి తీసుకువస్తామని తాజా ప్రకటనలో వాట్సాప్ వెల్లడించింది. జియో, వీఐ, తరువాయి 2 వ పేజీలో...




బెంగళూరు: ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ గుడ్ న్యూస్ చెప్పింది. 2026 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో తన ఉద్యోగుల సంఖ్య 8,440 మేర తగ్గినట్లు తెలిపింది. వరుసగా ఆరు త్రైమాసికాల పాటు కంపెనీలో ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న తర్వాత ఈ భారీ తగ్గుదల చోటుచేసుకుంది.అయితే ఈ ఏడాది మరో 20వేల మంది ఫ్రెషర్స్‌ను నియమించుకోనున్నట్లు వెల్లడించింది. ఇన్ఫోసిస్ ఫలితాల ప్రకటన సందర్భంగా ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేష్ సంఘరాజ్కా తరువాయి 2 వ పేజీలో...

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చనిపోయారు..?

### అదంతా అసత్య ప్రచారం: మంత్రి పొన్నం

నర్సంపేట, ఏప్రిల్ 23 (ఈవార్తలు): తెలంగాణలో జరుగుతున్న ఆర్టీసీ సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. సమ్మెలో భాగంగా తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ వరంగల్ జిల్లాలోని నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన డ్రైవర్ శంకర్ గౌడ్ మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఎంజీఎం నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో తరువాయి 2 వ పేజీలో...





## కాళేశ్వరంపై సుప్రీంకు సర్కార్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి తరువాయి 2 వ పేజీలో...




# చర్చలకు పిలుపు

## కార్మిక సంఘాలకు సర్కారు ఆహ్వానం



### భట్టి నేతృత్వంలో ఐదుగురితో కమిటీ

### 100 రోజుల్లో 'రిటైర్డ్' బకాయిల చెల్లింపు

### తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర సర్కారు నుంచి ఆహ్వానం అందింది. చర్చలకు రావాలని పిలుపునిచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా ఆర్టీసీ సమ్మె, కాళేశ్వరం విచారణ, ఉద్యోగుల బకాయిలు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధిపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేసింది.

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెపై మంత్రివర్గం తీవ్రంగా చర్చించింది. కార్మికులు ఎవరూ క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దని, సంయమనం పాటించాలని కేబినెట్ విజ్ఞప్తి చేసింది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అందుకే అధికారుల కమిటీని నియమించామని గుర్తు చేసింది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు ప్రభుత్వం అధికారికంగా పిలుపునిచ్చింది. ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ , శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ రావు, జూపల్లి కృష్ణారావు ఐదుగురితో కమిటీని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. మరోవైపు, కాళేశ్వరంపై తరువాయి 2 వ పేజీలో...

# పెట్రో ధరలు పెంచేది లేదు

## కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన



దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని ఊహాగానాలు, వార్తలు వస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ధరల పెంపు ప్రతిపాదనేదీ తమ దగ్గర లేదని.. ప్రస్తుతానికి ధరలు పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ధరల పెంపు ఉంటుందంటూ వస్తున్న వార్తలు.. దురుద్దేశపూరితమైనవని.. తప్పుదోవ పట్టించేవని.. ప్రజల్లో భయాందోళనల్ని సృష్టించేందుకు ఉద్దేశించినవి అని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. దీంతో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఇప్పట్లో ఉండదని ఒక క్లారిటీ వచ్చింది.

న్యూఢిల్లీ: ఇదే సమయంలో కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. వాస్తవానికి.. గత నాలుగేళ్లలో ప్రపంచంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచని ఏకైక దేశం కూడా భారత్ అని వెల్లడించింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ.. ఈ పెరుగుదల నుంచి ప్రజల్ని కాపాడేందుకు భారత ప్రభుత్వం, ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసిన సంగతి తెలిసిందే. చమురు, గ్యాస్ సరఫరాకు తీవ్ర అంతరాయం తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,365 |
| వెండి (గ్రాము): | రూ.270 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,214 |


# వద్దు నాయనో.. అమెరికా

## వదిలేద్దామనుకుంటున్న 40% ఇండియన్స్.. జీవన వ్యయం, రాజకీయ పరిస్థితులే కారణం




ఒకప్పుడు భారతీయులకు అమెరికా అంటే జీవితకాల కల.. ఒక అద్భుతమైన గమ్యస్థానం. కానీ మారుతున్న కాలంతో పాటు అగ్రరాజ్యంపై ఆకర్షణ మందగిస్తూ వస్తోంది. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న భారతీయ అమెరికన్లలో దాదాపు 40 శాతం మంది ఆ దేశాన్ని వదిలి వెళ్లిపోవాలని తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు కార్నెగీ ఎండోమెంట్ యూగవ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడి అయింది.

వాషింగ్టన్/న్యూఢిల్లీ: రాజకీయ అస్థిరత, పెరుగుతున్న ఖర్చులు, భద్రతా లేమి వంటి అంశాలు ఈ ప్రతికూల ధోరణికి ప్రధాన కారణాలుగా అని సర్వే చెబుతోంది. మొత్తం 1,000 మంది ప్రతినిధులతో నిర్వహించిన ఈ సర్వేలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు 40 శాతం మంది అమెరికాను విడిచి వెళ్లాలనే ఆలోచనలో తరువాయి 2 వ పేజీలో...




# బెంగాల్-1లో 91.78 శాతం

## తమిళనాడులో 84.51 శాతం.. ఎన్నికల్లో పోలింగ్ రికార్డులు


తమిళనాడు, బెంగాల్-1లో పోలింగ్ ముగింపు.. 2021 పోలింగ్ శాతాన్ని అధిగమించిన 2రాష్ట్రాలు

## విశ్వవాణి



జీపీఎస్ ప్రపంచవ్యాప్తంగా అందరూ ఉచితంగా వాడుకోవచ్చు. అయితే, దీనికోసం అమెరికానే మొత్తం నిధులను ఖర్చు చేస్తోంది. ఏటా రూ.11 వేల కోట్లు అమెరికా ట్యాక్స్ పేయర్లే ఖర్చును భరిస్తున్నారు.

## భారత్, చైనా నరకాలు: ట్రంప్




వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ వలసల విషయంలో భారత్‌పై మరోసారి విద్వేషం వెళ్లగక్కారు. భారత్‌ను నరకంతో పోల్చుతూ అమెరికా రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ రాసిన ఓ లేఖను ట్రంప్ తన ట్రుత్ సోషల్ పోస్టులో షేర్ చేశారు. ఇండియా, చైనా దేశాలను నరకకూపాలు అభివర్ణిస్తూ.. ఆ రెండు ఆసియా దేశాల నుంచి వచ్చే ప్రజలు.. అమెరికాలో 9 నెలల్లో ఓ బిడ్డను కనేస్తారు. ఇక చట్టం ప్రకారం వాళ్లు తక్షణమే అమెరికా పౌరులు అవుతారంటూ సావేజ్ తన లేఖలో విమర్శలు గుప్పించారు. కొన్ని గంటల్లోనే ట్రంప్ తన బుద్ధిని బయటపెట్టాడు. భారత్ గొప్ప దేశం. అక్కడ నాకు మంచి స్నేహితుడు (ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ) ఉన్నాడు. ఆయనతో నాకు వ్యక్తిగత స్నేహం ఉంది' అంటూ ట్రంప్ అన్నారని భారత్‌లోని అమెరికా కార్యాలయ ప్రతినిధి క్రిస్టోఫర్ ఎల్మ్స్ తెలిపినట్లు జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి.

## కాదు.. మహోన్నత దేశాలు: ఇరాన్



టెహ్రాన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ గట్టి కౌంటర్ ఇచ్చింది. భారత్, చైనా సహా ఇతర దేశాలను నరకాలతో పోలుస్తూ అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్ నాగరికతకు పుట్టినిల్లు అంటూ హైదరాబాద్‌లోని ఇరాన్ ఎంబసీ పోస్టు పెట్టింది. 'భారత్, చైనాలు మహోన్నత నాగరికతలకు పుట్టినిళ్లు. ఇరాన్ నాగరికతను నాశనం చేస్తామని ఒక యుద్ధ నేరస్థుడైన అధ్యక్షుడు చెప్పడమే అసలైన నరకం' అని విమర్శించింది. ఇరాన్ నాగరికత మొత్తం అంతమైపోతుందని గతంలో ట్రంప్ హెచ్చరికలు చేసిన తెలిసిందే. ఆ బెదిరింపులను ఉద్దేశించే తాజా స్పందన వచ్చింది.



## యూరియా యాప్‌పై కౌంటర్!

### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): రాష్ట్రంలో యూరియా విక్రయాల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన 'ఫర్టిలైజర్ బుకింగ్ యాప్' పై తెలంగాణ హైకోర్టు ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్ ఏర్పాటు, విధివిధానాలపై కౌంటర్ దాఖలు చేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. యూరియా కోసం యాప్ తీసుకురావడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై ఇవాళ న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

24.3.2026

మేషం: ఆర్థిక వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. వ్యాపార విషయమై కుటుంబసభ్యుల సలహాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలు మిశ్రమంగా సాగుతాయి.

వృషభం: దీర్ఘకాలిక ఋణాల నుండి బయటపడతారు. సమాజంలో పెద్దలతో నూతన పరిచయాలు విస్తృతమౌతాయి. అన్ని రంగాల వారికి అనుకూలత పెరుగుతుంది. ఆర్థికంగా ఆశించిన మార్పులుంటాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగస్తులకు అనుకూల స్థానచలనాలు కలుగుతాయి.

మిధునం: నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు కొంత నిదానంగా సాగుతాయి. స్థిరాస్తి విషయమై సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. నిరుద్యోగ ప్రయత్నలు నిదానంగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

కర్కాటకం: గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం నుండి కొంత ఉపశమనం లభిస్తుంది. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి.

సింహం: స్నేహితులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. నిరుద్యోగుల ప్రయత్నలు ఫలిస్తాయి. ఉద్యోగులకు అధికారుల ఆదరణ లభిస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. దీర్ఘకాలిక ఋణాలు తీర్చడానికి చేసే ప్రయత్నలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలుంటాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

తుల: నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. మిత్రులతో ఉన్న వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం.

వృశ్చికం: గృహమున సంతాన శుభకార్య విషయమైన చర్చలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. ప్రయాణాలలో వాహనాలు నడిపే విషయంలో అప్రమత్తంగా వ్యవహారించాలి. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: నిరుద్యోగులకు అధికారుల అండదండలు లభిస్తాయి. అన్ని వైపుల నుండి ఆదాయం అందుతుంది. దూర ప్రాంత బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంతాన విద్యావిషయాలలో శుభవార్తలు అందుతాయి.

మకరం: దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. దూరప్రాంత బంధు మిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. సంతాన ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి.

కుంభం: చిన్ననాటి మిత్రులతో ఒక విషయమై మాటపట్టింపులు కలుగుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనులలో అవరోధాలు కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వెయ్యడం మంచిది. ఉద్యోగ వ్యాపారములు అంతంత మాత్రంగా సాగుతాయి.

మీనం: ఆప్తులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. పాత సంఘటనలు గుర్తుచేసుకుని బాధపడతారు. గృహమున శుభకార్యాలకు ఖర్చులు చేస్తారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక లాభాలు అందుకుంటారు. దాయదులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు.

### బెంగాల్-1లో 91.78 శాతం.. తమిళనాడులో 84.51 శాతం

# ఎన్నికల్లో పోలింగ్ రికార్డులు

**తమిళనాడు, బెంగాల్-1లో పోలింగ్ ముగింపు**

**2021 పోలింగ్ శాతాన్ని అధిగమించిన 2రాష్ట్రాలు**



చెన్నై/కోల్‌కతా: తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం,పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో 91.78 శాతం, తమిళనాడులో 84.51 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే), తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# పెట్రో ధరలు పెంచేది లేదు

**మొదటి పేజీ తరువాయి**

ఏర్పడుతోంది. మరోవైపు అమెరికా కూడా ఇరాన్ నౌకల రాకపోకలపై దిగ్బంధనం విధించింది. ఇటీవల అమెరికా- ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినా.. యుద్ధం ముగింపుపై స్పష్టత లేదు. కొద్ది రోజుల కిందట పాకిస్థాన్ వేదికగా జరిగిన తొలి విడత చర్చలు విఫలమయ్యాయి. ఇప్పుడు రెండో విడత చర్చలు ఎప్పుడు జరుగుతాయన్నది క్లారిటీ లేదు. ఈ క్రమంలోనే క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. యుద్ధానికి ముందు బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 70 డాలర్ల కంటే తక్కువగానే ఉండగా.. యుద్ధం సమయంలో ఒక దశలో 120 డాలర్లకు కూడా చేరింది. ప్రస్తుతం 100 డాలర్లపైనే ఉంది. అయినప్పటికీ దేశీయంగా మాత్రం చమురు కంపెనీలు నష్టాల్ని భరిస్తున్నాయి. 3 ప్రభుత్వ రంగ సంస్థలు రోజుకు రూ. 1600 కోట్లకుపైగా నష్టపోతున్నట్లు అంచనా. ఈ క్రమంలోనే ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత.. ఏ సమయంలో అయినా లీటరుపై పెట్రోల్, డీజిల్ ధరలు రూ. 25-28 నుంచి పెరుగుతాయని వార్తలు వచ్చాయి. కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి తాజా ప్రకటన వచ్చింది. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు చూస్తే హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46 వద్ద ఉండగా.. డీజిల్ ధర రూ. 95.70 వద్ద ఉంది. ప్రధాన మెట్రో నగరాల్లో చూస్తే.. హైదరాబాద్‌లోనే ఇంధన ధరలు ఎక్కువగా ఉన్నాయి.

# వద్దు నాయనో.. అమెరికా

**మొదటి పేజీ తరువాయి**

ఉన్నట్లు తేలింది. వీరిలో 14 శాతం మంది తరచుగా, 26 శాతం మంది అప్పుడప్పుడు ఈ విషయంపై చర్చిస్తున్నట్లు వెల్లడైంది. ఇందులో సుమారు 58 శాతం మంది అమెరికాలోని రాజకీయ పరిస్థితులపై విసిగిపోయి వెళ్లాలనుకుంటున్నట్లు సర్వే స్పష్టం చేసింది. అలాగే మరో 54 శాతం మంది మితిమీరిన ఖర్చులను భరించలేక ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నట్లు పేర్కొంది. ఇంకో 41 శాతం మంది తమ వ్యక్తిగత భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. అందుకే వెళ్లిపోవాలనుకుంటున్నట్లు తెలిపింది. అమెరికాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు భారతీయ అమెరికన్లను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన అనుసరిస్తున్న ఆర్థిక, వలస విధానాలు 71 శాతం మందికి నచ్చడం లేదు. ముఖ్యంగా అమెరికా ఫస్ట్ నినాదాలు, జాతీయవాద ధోరణులు పెరుగుతుండటంతో.. తాము ఆ దేశానికి పరాయివారమనే భావన ప్రవాసుల్లో బలపడుతోంది. ఇది మాత్రమే కాకుండా అమెరికాలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరుస్తోంది. శాన్ ఫ్రాన్సిస్కో, న్యూయార్క్ వంటి నగరాల్లో సింగిల్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్ అద్దె నెలకు 3,000 నుంచి 5,000 డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 2.5 లక్షల నుంచి 4 లక్షలు) వరకు ఉంది. అలాగే అక్కడ ఓ బిడ్డను పెంచడానికి దాదాపు 3 లక్షల డాలర్లు (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 2.5 కోట్లు) ఖర్చు అవుతోంది. దీనితో పాటు పని ప్రదేశాల్లో, సోషల్ మీడియాలో వివక్ష ఎదురవుతుండగా.. తాము సురక్షితంగా లేమని చాలా మంది భారతీయులు భావిస్తున్నారు. దశాబ్దాలుగా అమెరికాలో ఉంటున్నా గ్రీన్ కార్డ్ (శాశ్వత నివాసం) రాకపోవడం, వీసా నిబంధనల్లో అనిశ్చితి మేధావులను సైతం విసిగిస్తోంది. మొత్తంగా చూస్తే.. సుమారు 5.2 మిలియన్ల జనాభా కలిగిన భారతీయ అమెరికన్ కమ్యూనిటీ.. ఇప్పుడు కేవలం డబ్బు కోసమే కాకుండా స్థిరత్వం, గౌరవం, భద్రత కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తోంది. అందుకే దేశాన్ని వదిలి ఇండియాకు వచ్చేయాలని భావిస్తోంది.

# కాళేశ్వరంపై సుప్రీంకు సర్కార్

**మొదటి పేజీ తరువాయి**

వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్‌కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

# 20000 ఉద్యోగాలు

**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడుతూ, వరుసగా తమ ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్నప్పటికీ, గత ఏడాదితో పోలిస్తే ఇది 5,000 మంది పెరిగిందన్నారు. త్రైమాసికంలో ఎప్పుడూ కొంత కాలానుగుణత ఉంటుంది. ఈ త్రైమాసికంలో వాల్యూమ్‌లు తక్కువగా ఉన్నాయి, దానికి తోడు సిస్టమ్‌లోకి వచ్చిన కొత్తవారిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు.జనవరి-మార్చి కాలం ముగిసే నాటికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య 3,28,594గా ఉంది, గత పన్నెండు నెలల ప్రాతిపదికన చూస్తే, ఈ త్రైమాసికంలో ఉద్యోగుల వలస రేటు (అట్రిషన్) మునుపటి త్రైమాసికంలోని 12.3 శాతం నుండి 12.6 శాతానికి పెరిగిందని తెలిపారు. భారతదేశపు రెండవ అతిపెద్ద ఐటీ సేవల ఎగుమతిదారు ఇప్పటికే 18,000 మంది కళాశాల గ్రాడ్యుయేట్లను నియమించుకుంది. కాగా, గత త్రైమాసికంలో దాని నికర ఉద్యోగుల సంఖ్య 5,000 మందికి పైగా పెరిగింది. అలాగే 2026 చివరి నాటికి, 20,000 మంది కళాశాల గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని ఇది అంచనా వేస్తోంది. డబ్ల్యూఈఎఫ్ దావోస్ సదస్సు సందర్భంగా ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, జనవరి 2026లో ఖీ27లో తమ కంపెనీ 20 వేల మంది కళాశాల గ్రాడ్యుయేట్లను నియమించుకుంటుందని మీడియాకు తెలిపారు. మరోవైపు, 28 శాతం లాభాలతో ఇన్ఫోసిస్ మార్కెట్ అం చనాలను అధిగమించింది. క్యూ4లో ఇన్ఫోసిస్ నికర లాభం 27.8 శాతం పెరిగి రూ. 8,501 కోట్లకు చేరిం. ఆదాయం త్రైమాసికం ప్రాతిపదికన 2 శాతం పెరిగి రూ. 46,402 కోట్లకు చేరింది 2026-27ఆర్థిక సంవత్సరానికి గాను తన ఆదాయ వృద్ధి అంచనా 1.5 శాతం నుండి 3.5 శాతం పరిధిలో ఉంటుందని తెలిపింది. 2026కి ఈ అంచనా 3 నుండి 3.5 శాతంగా ఉంది.

# వాట్సాప్‌లోనే మొబైల్ రీచార్జ్

**మొదటి పేజీ తరువాయి**

ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ ఇలా ఏ నెట్‌వర్క్ వినియోగదారులైనా సంబంధిత ప్లాన్ ఎంచుకుని ఈజీగా పేమెంట్ చేయవచ్చని తెలిపింది. భారత్‌లోని తమ యూజర్లు రోజువారీ టాస్కులను చాలా ఈజీగా పూర్తి చేసేందుకు వీలుగా మొబైల్ రీఛార్జి సదుపాయాన్ని సైతం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మెటా ఇండియా డైరెక్టర్ రవి గార్గ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మొబైల్ రీఛార్జి కోసం వేరు వేరు యాప్ లపైన ఆధారపడకుండా వాట్సాప్ యాప్ లోనే రీచార్జ్ ఎంపిక చేసుకుని పేమెంట్ కూడా చేసే వెసులుబాటును తెచ్చామని వెల్లడించారు. దీంతో పాటు రూపీ సింబల్ ను కూడా హోమ్ స్క్రీన్ లో కనిపించేలా వాట్సాప్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

**వాట్సాప్‌లో రీచార్జ్ ఇలా..**

- వాట్సాప్ లో మొబైల్ ప్రీపెయిడ్ రీచార్జ్ చేయాలంటే మొదటగా రూపీ సింబల్ పైన క్లిక్ చేయాల్సి ఉంటుంది.
- అక్కడ మొబైల్ ప్రీపెయిడ్ రీచార్జ్ ఆప్షన్ కనిపిస్తుంది దానిని ఎంచుకోవాలి.
- అందులో మీ ఫోన్ నంబర్ లేదా మీరు రీచార్జ్ చేయాల్సిన నంబర్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది.
- ఆపరేటర్‌ను ధ్రువీకరించుకున్నాక మీకు నచ్చిన మొబైల్ రీఛార్జి ప్లాన్ ఎంచుకోవాలి.
- యూపీఐ, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డుల సాయంతో పేమెంట్లు చేయవచ్చు.
- వాట్సాప్ లో ఇప్పటికే యూపీఐ పేమెంట్లు, మెట్రో టికెట్ బుకింగ్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.
- వాట్సాప్ యూపీఐతోనూ పేమెంట్లు చేయవచ్చు. లేదా మీకు నచ్చిన యూపీఐ ఐడీతో రీచార్జ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చనిపోయారు..?

**మొదటి పేజీ తరువాయి**



మృతి చెందాడని వార్తలు రాగా.. అదంతా అసత్యప్రచారం అని మంత్రి పొన్నం ప్రభాకర్ కొట్టిపడేశారు. 'శంకర్ గౌడ్ కి కంచన్ బాగ్ డిఆర్డీవో అపోలో ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతుంది. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందేలా అవాస్తవాలు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి. శంకర్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిపై అపోలో ఆసుపత్రి వైద్యులతో మాట్లాడాను. వారికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందని వారితో మాట్లాడడం హామీ ఇచ్చాను' అని మంత్రి పొన్నం తెలిపారు. మరోవైపు, తమ న్యాయమైన 32 డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఒకవైపు సమ్మె చేస్తూనే మరోవైపు ఆర్టీసీ బస్ డిపోల వద్ద, బస్టాండ్‌ల వద్ద నిరసనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్నారు.

# యూరియా యాప్‌పై కౌంటర్!


**మొదటి పేజీ తరువాయి**

యాప్ రైతులకు ఇబ్బందికరంగా మారిందని దీనిని వ్యతిరేకిస్తూ రైతులు ధర్నా చేస్తున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. అయితే ప్రభుత్వం తరపు న్యాయవాది వాదన వినిపిస్తూ యూరియా సరఫరాలో పారదర్శకత కోసంమే ఈ యాప్ తెచ్చామని కోర్టుకు విన్నవించారు. యూరియాపై ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తోందని, అర్హులైన రైతులకు మాత్రమే యూరియా చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కోర్టకు వివరించారు. షాపుల వద్ద కంటే యాప్ ద్వారానే ఎక్కువ యూరియా సరఫరా చేస్తున్నామని కోర్టుకు వివరించగా.. ప్రతి రైతుకు సాంకేతిక అవగాహన ఉండదు కదా అని ప్రభుత్వం తరపున న్యాయవాదనికి హైకోర్టు ప్రశ్నించింది. ఈ యాప్ పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ వాయిదా వేసింది.

# చర్చలకు పిలుపు

**మొదటి పేజీ తరువాయి**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును కేబినెట్ విశ్లేషించింది. జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమని కోర్టు అంగీకరించిందని, కేవలం నోటీసుల జారీలో ఉన్న సాంకేతిక లోపాలను మాత్రమే వేలెత్తి చూపిందని పేర్కొంది. ఈ తీర్పు సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకి కాదని న్యాయ నిపుణులు స్పష్టం చేయడంతో, సీబీఐ విచారణను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించింది. అలాగే, సుప్రీంకోర్టుకు వెళ్లాలా అనే అంశంపై ఢిల్లీ న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలని నిశ్చయించింది. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో పడ్డ వేల కోట్ల రూపాయల ఉద్యోగుల బిల్లులపై కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగులకు రూ. 8,000 కోట్లు, రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 6,200 కోట్ల బకాయిలు ఉన్నట్లు గుర్తించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నప్పటికీ, వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని నిర్ణయించింది. అవసరమైతే మంత్రులు, ప్రజా ప్రతినిధుల జీతాల నుండి 50 శాతం నిధులను ఇందుకోసం సర్దుబాటు చేస్తామని కేబినెట్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా పదవీ కాలం పూర్తయిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల విషయంలో కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో కొత్త పాలకవర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. దీనివల్ల వ్యవసాయ రుణాల పంపిణీ, ఇతర సహకార కార్యకలాపాలు ఎక్కడా ఆగకుండా సాఫీగా సాగే అవకాశం ఉంది. ఇక, హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ పద్ధతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఇక్కడ అందుబాటులో ఉన్న 76 ఎకరాల్లో 21 రకాల క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు కల్పిస్తారు. స్టేడియం సామర్థ్యాన్ని 50 వేలకు పెంచడంతో పాటు, ఒక అత్యాధునిక స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మిగిలిన 12 ఎకరాల్లో కమర్షియల్ కార్యకలాపాలకు అనుమతినిచ్చి, తద్వారా వచ్చే ఆదాయాన్ని క్రీడాకారుల శిక్షణ, వసతి కోసం కేటాయిస్తారు. మంథని నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు ద్వారా 63 గ్రామాల్లోని 45 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. భూసేకరణ సమస్యల వల్ల ఆలస్యమైన ఈ ప్రాజెక్టు కోసం మిగిలిన 1407 ఎకరాల సేకరించడానికి అవసరమైన రూ. 166.67 కోట్లను కేబినెట్ మంజూరు చేసింది. దీనివల్ల మహాదేవ్‌పూర్,



కాటారం వంటి వెనుకబడిన ప్రాంతాల రైతులకు మేలు జరుగుతుంది. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధిని కాంక్షిస్తూ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ రెవెన్యూ పరిధిలోని ఇరిగేషన్ విభాగానికి చెందిన 85.10 ఎకరాల భూమిని మత్స్య శాఖకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ఆక్వా పార్క్ ద్వారా చేపల పెంపకం, ప్రాసెసింగ్, ఎగుమతులకు సంబంధించి అత్యాధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

# నవీన్ పోగులకు మాగంటి సునీత పరామర్శ



జూబ్లీహిల్స్–హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, అడ్వకేట్ నవీన్ పోగులకు ఇటీవల వెన్నుపూస (డిస్క్ సమస్య) కి శస్త్రచికిత్స జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మాగంటి సునీత, వాత్సల్య.. ఆయన నివాసానికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అమ్మాజీ, సల్ల శ్రీనివాస్ యాదవ్, నర్సింగ్ దాస్, నాగరాజు, శరత్, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ చౌదరి, రవి కళ్యాణ్, శ్రావణ్, నాగు, ఇస్మాయిల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

**బ్యాంకులకు సజ్జనార్ కీలక ఆదేశాలు**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ అండ్ సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ... "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్–ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు. కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

# రాష్ట్రంలో కొత్తగా రోడ్లు

**శంషాబాద్ టు షాబాద్**

**ఔటర్ నుంచి కొడంగల్‌కు రేడియల్ రోడ్-2**

**81 కి.మీ. రహదారిని ప్లాన్ చేసిన ప్రభుత్వం**



హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా కొత్త హైవే ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. కేంద్రం నుంచి మంజూరైన ప్రాజెక్టులకు సంబంధించి కొన్ని పనులు ప్రారంభంకాగా.. మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. అలాగే రాష్ట్రంలో మరికొన్ని ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలు తెరపైకి తీసుకొచ్చారు. తాజాగా శంషాబాద్ టు షాబాద్ మధ్య కొత్తగా మరో రోడ్డు రాబోతోంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి షాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు ఈ రోడ్డు కీలకం కాబోతోంది. ఈ కొత్త రహదారి బుద్వేల్ దగ్గర ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రేడియల్ రోడ్–2 (81 కిలోమీటర్లు) ఓ భాగం కానుంది. ఇటీవలి కాలంలో శంషాబాద్‌తో పాటుగా షాబాద్ ప్రాంతల్లో ఇండస్ట్రియల్ కారిడార్ల సంఖ్య పెరిగింది. అంతేకాదు షాబాద్ నుంచి చేవెళ్ల వెళ్లే మార్గంలో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయడానికి కసరత్తు జరుగుతోంది. అందుకే రేడియల్ రోడ్–2 ద్వారా మెరుగైన రవాణా సౌకర్యం కల్పించొచ్చు అంటున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కార్గో ద్వారా ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలకు అవసరమైన యంత్రాలు, ఇతర వస్తువులు వస్తుంటాయి. అక్కడి నుంచి శంషాబాద్, షాబాద్ సమీపంలో ఉన్న కంపెనీలకు వీటిని తరలించాల్సి ఉంటుంది.. వీటి రవాణాకు ఈ రోడ్డు చాలా ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. రేడియల్ రోడ్–2 రోడ్డు బుద్వేల్ నుంచి ప్రారంభం అవుతుండగా.. షాబాద్ మీదుగా పూడూరు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ వరకు కొనసాగనుంది. ఈ కొత్త రహదారి పరిశ్రమలకు చాలా కీలకంగా మారనుంది. అంతేకాదు ప్రజా రవాణా కోసం రేడియల్ రోడ్–2కు సమాంతరంగా సర్వీస్ రోడ్లను నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ రేడియల్ రోడ్–2తో శంషాబాద్ నుంచి ఆ చుట్టుపక్కల ప్రాంతాలైన షాబాద్‌తో పాటుగా శంకర్‌పల్లి, చేవెళ్ల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు మరికొన్ని ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వచ్చి రవాణా సౌకర్యాలు మెరుగవుతాయంటున్నారు. ముఖ్యంగా షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతిరోజూ హైదరాబాద్‌కు ప్రజలు రాకపోకలు కొనసాగిస్తారు. అలాగే హైదరాబాద్‌లోని కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు కూడా ఎంతో మేలు జరుగుతుందంటున్నారు. షాబాద్ మండలంలో ఈ రేడియల్ రోడ్–2 కోసం ఇప్పటివరకు 300 ఎకరాలను సేకరించే పనిలో ఉన్నారు అధికారులు.. ఇప్పటికే బహిరంగ ప్రకటనలు కూడా జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ భూములు ఇచ్చిన రైతులకు రెవెన్యూ రికవరీ చట్టం–2013 ప్రకారం పరిహారం అందజేస్తారు. ఈ భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి టెండర్లు పిలవాలని భావిస్తున్నారు. మొత్తం మీద శంషాబాద్, షాబాద్ ప్రాంతాల రూపు రేఖలు మారబోతున్నాయి.

## ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న అరెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజూ ఉద్ధృతంగా కొనసాగుతోంది. తెలంగాణలోని దాదాపు అన్ని డిపోల నుంచి బస్సులు బయటకు రాకుండా కార్మికులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో డిపోల వద్ద ధర్నా చేస్తున్న కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్నతో పాటు పలువురు కీలక నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఈదురు వెంకన్న మాట్లాడుతూ... ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించకపోతే ఆందోళన పంథాను మారుస్తామని ఈదురు వెంకన్న హెచ్చరించారు. "మేము నిబంధనల ప్రకారమే సమ్మెకు దిగాం. ప్రభుత్వం అర్ధరాత్రి పిలిచినా చర్చలకు సిద్ధమే, కానీ ప్రభుత్వం అలసత్వం వీడాలి" అని ఆయన స్పష్టం చేశారు. జనగామ డిపో వద్ద టెంట్లు తొలగించడంతో కార్మికులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వరుసగా రెండో రోజు బస్సులు నిలిచిపోవడంతో సామాన్య ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వాహనదారులు భారీగా ఛార్జీలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

## బాధితులకు అండగా ఉంటా: మంగ్లీ

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): అధిక వడ్డీ ఆశ చూపి అమాయక ప్రజల నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన అంశం తెలంగాణను కుదిపేస్తోంది. ఈ ఆర్థిక మోసం కేసులో ప్రముఖ సింగర్ మంగ్లీపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుతో తనకు సంబంధం లేదని మంగ్లీ పలుమార్లు తెలిపారు. తాజాగా ఆమె మరోసారి స్పందించారు. ఈ కేసులో కావాలనే తన పేరును తెరపైకి తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, కొంతమంది తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. బాధితులకు కూడా న్యాయం జరిగే వరకు తాను వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంగ్లీ తనకు ఉన్న పాపులారిటీని ఉపయోగించి ఇందులో డబ్బులు పెట్టేలా ప్రోత్సహించారని, ఆమె సోదరుడు శివ కూడా ఇందులో భాగస్వామి అని బాధితుల తరఫు న్యాయవాది ఫిర్యాదు చేశారు. దీనితో మంగ్లీతో పాటు ఆమె సోదరుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## నేటి నుంచి వేసవి సెలవులు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. శుక్రవారం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.





## కొండగట్టు అంజన్న సేవలో బల్మూరి

మల్యాల, ఏప్రిల్ 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నర్సింగరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వేదోక్త స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి వేదోక్త ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎస్ అంజనారెడ్డి, ఎమ్మెల్సీకి శాలువా కప్పి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ తూము శ్రీనివాస్‌తో పాటు స్థానిక సర్పంచ్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

## జగిత్యాల ఎస్పీని కలిసిన ఏఎస్పీ చేతన్ నితిన్




జగిత్యాల, ఏప్రిల్ 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ గా గురువారంచేతన్ నితిన్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. చేతన్ నితిన్ ఐపిఎస్ 2022 బ్యాచ్ కు చెందిన అధికారి కాగా, ఆయన గతంలో జనగామ ఏఎస్పిగా విధులు నిర్వర్తించారు.

## వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దావ వసంత సురేష్**

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శోభల వివాహ వార్షికోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. అనంతరం వెల్దుర్తి గ్రామంలోని గట్టు మల్లికార్జున స్వామి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ లు సదా శివరావు, మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్, గొల్లపల్లి సర్పంచ్ ప్రకాష్, ఉప సర్పంచ్ సర్పంచ్ తిరుపతి, నాయకులు కొండల్ రెడ్డి, మహేష్, లింగన్న, హరీష్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి ఎంఆర్‌టీ డివిజనల్ ఇంజనీర్‌గా కే శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఈవార్తలు): పెద్దపల్లి ఎంఆర్‌టీ అండ్ కన్‌స్ట్రక్షన్ డివిజనల్ ఇంజనీర్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. వరంగల్‌లోని ఎన్‌పీడీసీఎల్ కేంద్ర కార్యాలయంలో ఎనర్జీ ఆడిట్ ఉ అసెస్మెంట్ విభాగంలో డివిజనల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ని, పరిపాలనా కారణాల దృష్ట్యా పెద్దపల్లికి బదిలీ చేస్తూ సీఎండీ వరుణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఎండీ ఆదేశాల మేరకు శ్రీనివాస్ రెడ్డి నిన్న సాయంత్రం పెద్దపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను సూపరింటెండెంట్ ఇంజనీర్లు గంగాధర్, గోపికృష్ణలతో పాటు పలువురు డిఈలు, ఏడీఈలు మరియు డివిజన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కె. శ్రీనివాస్ రెడ్డికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో సుదీర్ఘ అనుబంధం ఉండటంతో పాటు, ఎంఆర్‌టి విభాగం నిర్వహణలో విశేషమైన అనుభవం ఉంది. ఆయన రాకతో పెద్దపల్లి డివిజన్ పరిధిలో విద్యుత్ సేవలు మరింత మెరుగుపడతాయని, ముఖ్యంగా సాంకేతిక సమస్యల పరిష్కారంలో వేగం పెరుగుతుందని విద్యుత్ ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యాసంస్థల్లో భోజన నాణ్యతపై రాజీ లేదు: అడ్లూరి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వెల్ఫేర్ వీక్ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా



ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, భోజన నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఆహారం రుచి, సమయపాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. డైట్ మెను అమలు, వంటశాల నిర్వహణ, నీటి వినియోగం, నిల్వ విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మంత్రి మాట్లాడుతూ సంక్షేమ విద్యాసంస్థల్లో భోజన నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి విద్యార్థికి సమయానికి ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, పోషకాహారం అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తు బలపడుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కూడా వంటశాలల్లో పరిశుభ్రత, నాణ్యమైన పదార్థాల వినియోగంపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో, జిల్లా సంక్షేమ అధికారి, మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్‌కు ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం వాసవీమాత జయంతిని అధికారం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి, ఎమ్మెల్యే డా.సంజయ్‌ను శాలువతో సన్మానించి వాసవిమాత చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు నవీన్, నాయకులు గట్టు సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బోడ్ల జగదీష్, కోశాధికారి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ రాజేందర్, చంద్రకాంత్, సతీష్, కోటగిరి సంజయ్, చందు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ మహర్షికి ఘన నివాళి



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): ఐడీఓసీ జగిత్యాలలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రెవిన్యూ అదనపు కలెక్టర్ బి.ఎస్. లత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగీరథ మహర్షి సమాజహితం కోసం చేసిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగేందుకు తెలంగాణ ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారిణి జి. సునీత, కలెక్టరేట్ ఏవో కిషన్, జిల్లా అధికారులు, సిబ్బంది, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్రంలో గో సేవా శాఖను ఏర్పాటు చేయాలి

**27న 'గో గౌరవ ఆహ్వాన్ అభియాన్'**

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని, గోవుల సంరక్షణ చేపట్టాలని, దేశంలో గోవధను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న 'గో గౌరవ ఆహ్వాన్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్ పటేల్, గోవత్స ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీ మనోహర్ పల్లోడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్ పటేల్, గోవత్స ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీ మనోహర్ పల్లోడ్ మాట్లాడుతూ.. 'గౌ' సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్' కింద, గోమాతకు రాష్ట్రమాత, రాష్ట్ర ఆరాధ్య రాజ్యాంగ హోదా కల్పించాలని కోరారు. కేంద్రంలో గో సేవా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ఒక ఏకీకృత కేంద్ర చట్టాన్ని రూపొందించాలని కోరుతూ 27న సోమవారం నాడు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల గవర్నర్లకు, ముఖ్యమంత్రులకు వినతిపత్రాన్ని సమర్పించనున్నట్లు వారు తెలిపారు. ఈ ప్రచారం ఏ రాజకీయ పార్టీకి, సంస్థకు, కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ఇది గోమాత సేవ, రక్షణ, గౌరవానికి అంకితమైనదని వారు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత ప్రభుత్వాలు 65 ఏళ్లలో కూడా సాధించలేని చారిత్రాత్మక కార్యాలు సాధించబడ్డాయని జస్మత్ పటేల్ అన్నారు. ఇది మోదీ యొక్క అచంచలమైన దేశభక్తి, ఉక్కు సంకల్పం, అద్భుతమైన సామర్థ్యం వల్లే సాధ్యమైందని తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని ఆలయం, కాశీ విశ్వనాథ ఆలయ నిర్మాణం, కాశీ విశ్వనాథ ఆలయ పునరుద్ధరణ, జమ్మూ కాశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం పట్ల ప్రధానికి ఉన్న సంకల్పానికి సనాతనులందరూ తలవంచుతారని అన్నారు. భారతీయ ఆవు మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వానికి సజీవ చిహ్నం. ఆవుకు రక్షణ లేనంత కాలం, మన సాంస్కృతిక



సమగ్రత అసంపూర్ణంగానే మిగిలిపోతుందని పేర్కొన్నారు. భారతదేశ ఆధ్యాత్మిక తేజస్సును పునరుజ్జీవింపజేసినట్లే, కేంద్ర చట్టం ద్వారా ఆవుకు రక్షణ, జాతీయ గౌరవం కల్పించడం ద్వారా భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనం అనే ఈ గొప్ప త్యాగాన్ని ప్రధాని నరేంద్ర మోడీ పూర్తి చేయగలరనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. సరిహద్దుల గుండా జరిగే అక్రమ రవాణా, క్రూరమైన వధ, వీధుల్లోని ఆవుల దుస్థితి చూసి ప్రతి సనాతన భారతీయుడి హృదయం విలపిస్తోందన్నారు. ప్రధాని పనితీరు ఎల్లప్పుడూ నిశ్చయాత్మకంగా, ఫలితాత్మకంగా ఉంటుంది, అందుకే యావత్ దేశం ప్రధాని వైపు ఆశతో చూస్తోందన్నారు. ప్రధాని నాయకత్వంలో ప్రతి భారతీయుడు ప్రతిజ్ఞ చేసిన రాజ్యాంగ గౌరవం, ఆచంచలమైన రక్షణ, సరైన సేవ ఆవుకు లభిస్తాయని దేశానికి పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. పశువులు కేవలం విశ్వాసానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, అవి భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని సిఏ మురళీ మనోహర్ పల్లోడ్ అన్నారు. ప్రధానమంత్రి ఆత్మనిర్భర భారత్ కల ఎప్పుడైతే పూర్తిగా సాకారమవుతుందో అప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుందని అన్నారు. ఆహార ప్రదాతలైన రైతులు, రసాయన ఎరువులు విషచక్రం నుండి విముక్తి పొంది. గోవుల ఆధారిత సహజ వ్యవసాయాన్ని స్వీకరిస్తారని అన్నారు. ఇది నేల సారవంతాన్ని పునరుద్ధరించడమే కాకుండా, ప్రతి భారతీయునికి సాత్విక ఆహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్యకరమైన, వ్యాధి రహిత భారతదేశానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. బలమైన నాయకత్వంలో.పశువుల సంరక్షణ, దేశ ఆహార భద్రతకు, గ్రామీణ శ్రేయస్సుకు కొత్త దిశను అందిస్తుందన్నారు. రిదేష్ జాగీర్దార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 'గౌ' సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్' కింద ఏప్రిల్ 27న 5 వేల మండల కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ 'గౌ సమ్మాన్' ఆహ్వాన్ అభియాన్' కింద, దేశంలోని సుమారు 780 జిల్లాల్లోని ప్రతి జిల్లా కేంద్రంలో ముగ్గురు సాధువులు, ముగ్గురు గోవుల ప్రేమికులు పాల్గొని, ఆయా జిల్లాలోని ఇతర గోవుల ప్రేమికులు.. సాధువులు, గోరక్షకులతో అనుసంధానం చేస్తారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమం ఏ సంస్థ, సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడదని పేర్కొన్నారు. ప్రధాన పోషకురాలు వేద లక్షణ గౌ మాత అధ్యక్షుడు నంది బాబా (వృషభ)కు ఇది అంకితం చేయబడుతుందన్నారు. ప్రచార కార్యక్రమంలో ఏ సాధువు, మహంత్, నాయకుడు, నటుడు, కార్యకర్త యొక్క ఫోటో, పోస్టర్, బ్యానర్, హోర్డింగు ఏర్పాటు చేయరని తెలిపారు. కార్యక్రమంలో తరుణ్ మెహతా, బద్రివిశాల్ లోయా, బాల స్వామి బండారి, కె. రమేష్, తదితరులు పాల్గొనారు.



## అడ్లూరి ఉదారత.. దివ్యాంగురాలికి స్కూటీ

ధర్మపురి, ఏప్రిల్ 23 (ఈవార్తలు): కష్టాల్లో ఉన్న దివ్యాంగురాలిని ఆదుకుంటూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవతా హృదయాన్ని చాటుకున్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నామపూర్ గ్రామానికి చెందిన జొన్నల శిరీషకు స్కూటీ అందజేశారు. ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌లో ప్రయాణం కష్టంగా మారడంతో సహాయం కోరిన శిరీషను మంత్రి కలుసుకుని స్పందించారు. తన శాఖ ద్వారా స్కూటీ అందించాలని అధికారులను ఆదేశించగా, గురువారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్కూటీని అందజేశారు. స్కూటీ అందుకున్న శిరీష ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## శవంపై ఉన్న బంగారం మాయం

**జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం**

**ఆసుపత్రి సిబ్బందిపై బాధితుల ఆగ్రహం**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): జగిత్యాలలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో దారుణం జరిగింది. మృతురాలి బంగారు చెవి కమ్మలు ఆసుపత్రి సిబ్బంది మాయం చేశారని భాధితులు ఆరోపించారు. గురువారం ఆసుపత్రిలో బంగారు కమ్మలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు ఆందోళన చేయగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జగిత్యాల పట్టణ పోలీసులు రంగప్రవేశం చేసి బాధితులతో మాట్లాడారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం జగిత్యాల ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు గురువారం మృతి చెందగా కుటుంబ సభ్యులు అంబులెన్స్ లో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. మృతురాలికి చెందిన బంగారు చెవి కమ్మలు కనపడక పోవడంతో బాధితులు జగిత్యాల ఆసుపత్రికి చేరుకుని బంగారం ఆసుపత్రికి చెందిన సిబ్బంది మాయంచేశారని ఆరోపించారు. ఆసుపత్రికి చెందిన ఇద్దరు మహిళా సిబ్బంది బంగారు కమ్మలు మాయం చేశారని ఆరోపిస్తూ ఆసుపత్రిలో ఆందోళన చేశారు. తమ బంగారం ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. ఆసుపత్రి అధికారులు, సిబ్బంది, బాధితులతో పోలీసులు మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

## జగిత్యాల జిల్లాలో పోలీస్ బదిలీలు

**ముగ్గురు సీఐలకు కొత్త పోస్టింగ్స్**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): మల్టీ జోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజిపి చంద్రశె ఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మికుంట రూరల్ సిఐగా పనిచేస్తున్న కే.లక్ష్మీనారాయణను జగిత్యాల జిల్లా కోరుట్ల సర్కిల్ కు, కోరుట్లలో పనిచేస్తున్న డి. సురేష్ బాబును మెట్పల్లి సర్కిల్ కు, మెట్పల్లిలో పనిచేస్తున్న వి. అనిల్ కుమార్ ను ఐజి కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కోరుట్ల సీఐగా బదిలీ అయిన కె.లక్ష్మినారాయణ గతంలో జగిత్యాల జిల్లా ఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తించారు.



## కాళేశ్వరంపై కాంగ్రెస్ చిల్లర ప్రచారం: దావ వసంత

జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 23 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు ప్రాణవాయువు అని మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. గురువారం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలకు హైకోర్టులో వెలువడిన తీర్పు చెంపపెట్టులా ఉందని ఈ తీర్పు యావత్ తెలంగాణ ప్రజలు, రైతన్నల విజయంగా భావించవచ్చన్నారు. కాళేశ్వరంప్రాజెక్ట్ కట్టకముందు ఏసంగి పంటకు నీరు లేక బీడు భూములు ఉండేవని కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన తర్వాత రెండు పంటలకు సరిపడే నీళ్లు ఇచ్చి లక్షల ఎకరాల భూమి సాగు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన వ్యక్తి తెలంగాణ బాగు కోరుకునే వ్యక్తి కేసీఆర్, తెలంగాణను నాశనం చేయాలని, నిర్వీర్యం చేయాలనే ఆలోచన కేసీఆర్ కు, బీఆర్ఎస్ పార్టీకి ఉండదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు ఒక కల్పతరువు లాంటిది, తెలంగాణలో ప్రతి గుంటకు నిరంధించిన అపర భగీరథుడు కేసీఆర్ అని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో రైతన్నలు మొగులుకు మొఖం పెట్టి చూడకుండా నార్లు పోసిన ఘనత కెసిఆర్ దన్నారు. కెసిఆర్ను బద్నాం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి రెండు పిల్లర్ లు కుంగుతే వాటిని మరమ్మత్తు చేయడం చేతకాక కాళేశ్వరం ప్రాజెక్టు పై చిల్లర ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ రెండున్నర సంవత్సరాలు కుంగిన పిల్లర్లు రిపేరు చేయకుండా రైతన్నలకు నీళ్లు ఇవ్వకుండా రైతులను మోసం చేశాన్నారు. చట్టాలపై తమకు గౌరవం ఉంది కాబట్టి వారు ఎప్పుడు పిలిచిన కూడా విచారణకు సహకరించి చివరకు కడిగిన ముత్యంలా కేసీఆర్ బయటకు వచ్చారన్నారు. హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని ప్రజలందరూ గమనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, రూరల్ మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు, కౌన్సిలర్ లు అవారి శివ కేసరి బాబు, కోరుకంటి రాము, సామల్ల శేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, మాజీ పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, నాయకులు ఓద్ది రామ్ మోహన్, కచ్చు హరీష్, గుండా మధు, తదితరులు పాల్గొన్నారు.



## ధర్మపురిలో తాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

ధర్మపురి, ఏప్రిల్ 23 (ఈవార్తలు): అమృత్ 2.0 పథకం కింద ధర్మపురిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్ పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తో కలిసి వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను తనిఖీ చేసి, నాణ్యత, పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు కట్టుబడి ఉన్నామని, పనులను సమయానికి పూర్తి చేస్తామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ.. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ నాగలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చల్‌గల్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 23 (ఈవార్తలు): రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ వ్యవసాయ మార్కెట్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



# మాల్దీవులకు వెళ్తున్నారా.. జాగ్రత్త!

## భారతీయులకు కేంద్రం హెచ్చరిక.. కఠినతర డ్రగ్స్ చట్టాలపై అలర్ట్

న్యూఢిల్లీ: మాల్దీవులకు వెళ్లే భారత పౌరులకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆ దేశంలో మాదకద్రవ్యాల నిరోధక చట్టాలను అత్యంత కఠినతరం చేసిన నేపథ్యంలో, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వేసవి సెలవుల సీజన్ కావడంతో మాల్దీవుల పర్యటనకు ప్లాన్ చేసుకునే వారు కొన్ని విషయాలను గమనించాలని స్పష్టం చేసింది. మాల్దీవుల ప్రభుత్వం ఇటీవల తన డ్రగ్స్ చట్టాలకు సవరణలు చేసిందని, ఇవి 2026 మార్చి నుంచి అమల్లోకి వచ్చాయని ఎన్సీబీ తెలిపింది. ఈ కొత్త చట్టాల ప్రకారం, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలకు పాల్పడితే జీవిత ఖైదు, భారీ స్థాయిలో డ్రగ్స్ రవాణా చేస్తే కోర్టు అనుమతితో మరణ శిక్ష కూడా విధించే అవకాశం ఉందని వివరించింది. స్వల్ప పరిమాణంలో డ్రగ్స్ దొరికినా కఠిన శిక్షలు తప్పవని పేర్కొంది. ఇటీవల కాలంలో కొందరు భారత పౌరులతో సహా పలువురు విదేశీయులు డ్రగ్స్ కేసుల్లో మాల్దీవుల్లో అరెస్ట్ అయిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఎన్సీబీ గుర్తుచేసింది. ఈ నేపథ్యంలోనే మాలేలోని భారత హైకమిషన్ కూడా స్థానిక చట్టాలను గౌరవించాలని ఇప్పటికే సూచించింది. "ఈ పరిస్థితుల దృష్ట్యా, భారత పౌరులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులు ఇచ్చే ప్యాకెట్లు, లగేజీలు లేదా వస్తువులను, వాటిలో ఏముందో కచ్చితంగా తెలియకుండా తీసుకెళ్లవద్దు. విమానాశ్రయాలు, పోర్టులలో తెలియని వ్యక్తులు ఏవైనా వస్తువులు తీసుకెళ్లమని అడిగితే అత్యంత జాగ్రత్తగా ఉండాలి" అని ఎన్సీబీ తన ప్రకటనలో పేర్కొంది. చట్టం తెలియదనే వాదన కోర్టులో చెల్లదని, కాబట్టి ప్రయాణికులు తమ లగేజీ విషయంలో పూర్తి జాగ్రత్త వహించాలని సూచించింది. ఎవరైనా అనుమానాస్పదంగా సంప్రదిస్తే జాతీయ నార్కోటిక్స్ హెల్ప్‌లైన్ నంబర్ '1933'కు సమాచారం ఇవ్వాలని కోరింది.




# కొత్త కొత్తగా టీవీఎస్ రైడర్ 125

ముంబై: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ, తన పాపులర్ 125సీసీ కమ్యూటర్ బైక్ 'రైడర్'ను అప్‌డేట్ చేసింది. 2026 మోడల్ టీవీఎస్ రైడర్ 125ను కొత్త రంగులు, అధునాతన ఫీచర్లతో భారత మార్కెట్లో విడుదల చేసింది. స్పోర్టీ లుక్‌తో యువతను ఆకట్టుకుంటున్న ఈ బైక్‌లో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ కొత్త అప్‌డేట్‌లో ప్రధాన ఆకర్షణగా 'నైట్రో గ్రీన్' కలర్ ఆప్షన్ నిలుస్తోంది. ఈ రంగు బైక్ హెడ్‌ల్యాంప్, ఫ్యూయల్ ట్యాంక్, సైడ్ ప్యానెల్స్‌కు స్పోర్టీ లుక్‌ను అందిస్తోంది. ముందు వీల్ గ్రీన్ కలర్‌లో, వెనుక వీల్ బ్లాక్ కలర్‌లో ఉండటం మరో విశేషం. అయితే ఈ కొత్త కలర్ కేవలం టాప్-స్పెక్ వేరియంట్లయిన టీఎఫ్టీ డీడీ, ఎస్ఎక్స్ డీడీలలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. వీటితో పాటు మెటాలిక్ బ్లూ, స్ట్రైకింగ్ రెడ్ రంగులు కూడా కొనసాగుతాయి. ఫీచర్ల విషయానికొస్తే, టాప్-ఎండ్ టీఎఫ్టీ డీడీ వేరియంట్‌లో కీలక మార్పు చేశారు. పాత ఎల్‌సీడీ డిస్‌ప్లే స్థానంలో కొత్తగా పూర్తి-కలర్ టీఎఫ్టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను అమర్చారు. దీని ద్వారా టర్న్-బై-టర్న్ నావిగేషన్, కాల్ అలర్ట్స్, వెదర్ అప్‌డేట్స్, లైవ్ స్పోర్ట్స్ స్కోర్లు వంటి అనేక కనెక్టెడ్ ఫీచర్లను పొందవచ్చు. మిగతా వేరియంట్లలో ఎల్‌సీడీ కన్సోల్ కొనసాగుతుంది. బైక్ ఇంజిన్‌లో మాత్రం టీవీఎస్ ఎలాంటి మార్పులు చేయలేదు. గతంలో మాదిరిగానే 124.8 సీసీ ఎయిర్ అండ్ ఆయిల్-కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌నే కొనసాగించారు. ఇది 11.38 హార్స్‌పవర్ శక్తిని, 11.2 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇక ధరల విషయానికొస్తే, 2026 టీవీఎస్ రైడర్ 125 బేస్ వేరియంట్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 82,860 నుంచి ప్రారంభం కాగా, టాప్-ఎండ్ వేరియంట్ ధర రూ. 98,550గా ఉంది.

# బెంగాల్ టైగర్.. బీజేపీ!

## పోలింగ్ శాతమే నిదర్శనం.. ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దండెత్తింది బీజేపీ కాదని... రాష్ట్రంలోని మహిళలు, యువతే చురుకైన పోరాటాన్ని ప్రారంభించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గురువారం 152 నియోజకవర్గాల్లో జరిగిన తొలిదశ అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన అధిక ఓటింగ్ శాతమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. బెంగాల్ లో సాయంత్రం 5 గంటల సమయానికి 89.93 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశ ఎన్నికలు ఏప్రిల్ 29న జరగనున్న నేపథ్యంలో, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మధురాపూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో ప్రధాని మాట్లాడారు. తీవ్రమైన ఎండను కూడా లెక్కచేయకుండా ఓటర్లు పోటెత్తడం చూస్తుంటే, మే 4వ తేదీ కేవలం ఫలితాల రోజు మాత్రమే కాదని, పశ్చిమ బెంగాల్‌లో మార్పునకు నాంది పలికే రోజని రుజువు చేస్తోందని మోదీ పేర్కొన్నారు. "ఈరోజు ఓటర్లలో కనిపించిన ఉత్సాహం, ముఖ్యంగా మహిళలు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతలో కనిపించిన ఆసక్తి, తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిజమైన పోరాటాన్ని ప్రారంభించింది వారేనని నిరూపించింది" అని ఆయన వివరించారు. ఇటీవల లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణను అడ్డుకోవడంలో తృణమూల్ కాంగ్రెస్ పోషించిన పాత్రతో ఆ పార్టీ అసలు స్వరూపం రాష్ట్రంలోని మహిళలకు అర్థమైందని మోదీ అన్నారు. "లోక్‌సభలో జరిగిన పరిణామాలతో



తృణమూల్, ఇతర ప్రతిపక్ష పార్టీల మహిళా వ్యతిరేక వైఖరి బయటపడింది. అందుకే ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని బెంగాల్ మహిళలు నిర్ణయించుకున్నారు. మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలిచినందుకు ఈసారి తృణమూల్‌ను వారు కచ్చితంగా శిక్షిస్తారు. బెంగాల్ కాళీమాత, దుర్గామాత వెలసిన నేల. కానీ తృణమూల్ పాలనలో ఇక్కడ మహిళలకు భద్రత లేదు. కాబట్టి మీ ఓటు అన్నింటినీ మారుస్తుంది. ఇకపై అన్యాయాన్ని సహించవద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు మే 4వ తేదీ గడువు తేదీ అవుతుందని మోదీ జోస్యం చెప్పారు. అవినీతి, దోపిడీ, హింస, మహిళలపై నేరాలతో నిండిన చీకటి రోజులు ఆ రోజుతో ముగిసిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత, అక్రమ చొరబాట్ల విషయంలో శూన్య సహన విధానాన్ని అవలంబిస్తామని స్పష్టం చేశారు. "దక్షిణ 24 పరగణాల జిల్లాలో స్థానిక మత్స్యకారుల హక్కుల వాటాను అక్రమ చొరబాటుదారులు లాక్కుంటున్నారు. కానీ తృణమూల్ కాంగ్రెస్ మాత్రం తమ ఓట్ల కోసం అక్రమ చొరబాట్లను కొనసాగించాలని కోరుకుంటోంది. అక్రమ చొరబాటుదారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నా తృణమూల్ వ్యతిరేకిస్తోంది" అని ప్రధాని ఆరోపించారు.

# చర్చలకు ఓకే.. కానీ!



### ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి కౌంటర్

టెహ్రాన్: అమెరికాతో యుద్ధం, చర్చల ప్రతిపాదనల నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ 'ఎక్స్' వేదికగా అగ్రరాజ్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ చర్చలను, ఒప్పందాలను స్వాగతించిందని, ఎప్పటికీ స్వాగతిస్తుందని పేర్కొన్నారు. కానీ వాగ్దానాల ఉల్లంఘనను సహించేది లేదని పేర్కొన్నారు. మాట తప్పడం, దిగ్బంధనాలకు పాల్పడటం, బెదిరింపులకు గురి చేయడం వంటివి చర్చలకు అడ్డంకిగా మారుతాయని పేర్కొన్నారు. అమెరికా చెబుతున్న మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన లేదని అన్నారు. మీ కపటమైన డొల్ల మాటల తీరును ప్రపంచం గమనిస్తోందని అన్నారు. ఒకవైపు చర్చలు, సంప్రదింపులు అంటూనే మరోవైపు అమెరికా ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తోంది. హర్మూజ్ జలసంధి వద్ద బలగాలని మోహరించింది. ఇంకోవైపు, ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేస్తోంది. చర్చల ప్రతిపాదనలు వస్తున్నప్పటికీ, దాడులు, దిగ్బంధాలు కొనసాగుతుండటంతో కొలిక్కి రావడం లేదు.

### చర్చల కోసం ఎలాంటి ఒత్తిడి లేదు: ట్రంప్

ఇరాన్‌తో చర్చలు పునఃప్రారంభించడానికి తనపై ఎలాంటి ఒత్తిడి లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, కాల్పుల విరమణ పొడిగింపు స్వల్పకాలమే అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. ఈ సంఘర్షణను తాను త్వరగా ముగించాలనుకుంటున్నట్లు ప్రజలు భావిస్తున్నారని, కానీ అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి తమ ఆలోచన అంతా అమెరికా ప్రజల కోసం ఒక మంచి ఒప్పందం కుదుర్చుకోవడం పైనే ఉందని అన్నారు. శాంతి ప్రతిపాదనను సమర్పించడానికి ఇరాన్‌కు ఎలాంటి గడువును విధించలేదని అన్నారు. కాల్పుల విరమణ కొనసాగుతుండగా హర్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. బుధవారం ఇరాన్ పలు నౌకలపై కాల్పులు జరిపి, కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ అంశంపై కూడా ట్రంప్ స్పందించారు. ఇరాన్ స్వాధీనం చేసుకున్న నౌకలు తమవి కావని తెలిపారు. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఇరాన్ నాయకత్వాన్ని దిగ్బంధనం ఎక్కువగా భయపెడుతోందని వ్యాఖ్యానించారు. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలకు అధిక నష్టం జరుగుతోందని, దీంతో వారి చమురు బావులు శాశ్వతంగా మూతపడాల్సిన పరిస్థితి రావొచ్చని హెచ్చరించారు.

# అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం

### బెంగాల్‌ను విముక్తం చేయండి: అమిత్ షా

### హుగ్లీ జిల్లా బాలాగర్ లో అమిత్ షా బహిరంగసభ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుగ్లీ జిల్లా బాలాగర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భద్రత, ఆర్థిక వ్యవస్థపై అక్రమ వలసల ప్రభావాన్ని ఎండగట్టారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాగానే ఒక్కరిని కూడా అక్రమంగా సరిహద్దు దాటి రానివ్వబోమని, ఇప్పటికే ఉన్న వారిని గుర్తించి పంపించివేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు దక్కాల్సిన రేషన్, ఉద్యోగాలను ఈ అక్రమ వలసదారులు లాగేసుకుంటున్నారని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఆటంకమని ఆరోపించారు. మీరు వేసే ఓటు కేవలం ఒక ఎమ్మెల్యే కోసమే కాదని, అక్రమ చొరబాటుదారుల నుంచి బెంగాల్ విముక్తి కోసం కూడా అని పేర్కొన్నారు. మే 5వ తేదీతో 'దీదీ' పాలన ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నేడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి తొలి దశ (152 స్థానాలు) పోలింగ్ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికే దాదాపు 89 శాతానికి పైగా భారీ ఓటింగ్ నమోదైంది.

# యోగి నాయకత్వంలోనే యూపీ ఎన్నికలకు!

### బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

లక్నో: వచ్చే ఏడాది జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు? అనే ప్రశ్నకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. యోగి నాయకత్వంలోనే ఎన్నికల రణక్షేత్రంలోకి వెళతామని ఆయన స్పష్టం చేశారు. "యూపీలో యోగి ఆదిత్యనాథే మా ముఖచిత్రం. ప్రస్తుతం ఆయన నాయకత్వంలోనే ప్రభుత్వం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే మా సారథి" అని అన్నారు. 2017, 2022 విజయాల తర్వాత 2027లో కూడా ఘనవిజయం సాధించి యూపీలో బీజేపీ హ్యాట్రిక్ సృష్టిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు నేరాలకు నిలయంగా ఉన్న యూపీ, ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ వేలు, శాంతిభద్రతలు, పారిశ్రామికాభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పేర్కొన్నారు. మోదీ-యోగి 'డబుల్ ఇంజిన్' సర్కార్ చేసిన పనులే తమకు వచ్చే ఎన్నికల్లో ఓట్లు తెస్తాయని చెప్పారు. మరోవైపు, అఖిలేశ్ యాదవ్ సారథ్యంలోని సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికే 'మిషన్ 2027' పేరుతో ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో బీజేపీ ముందస్తుగానే తన సేనానిని ప్రకటించి వ్యూహాత్మకంగా అడుగు వేసింది.

# హర్మూజ్ వద్ద 14 భారత నౌకలు

టెహ్రాన్: హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, గత కొన్ని వారాల్లో 14 భారత నౌకలు ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా బయటపడ్డాయని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అయితే, మరో 14 నౌకలు ఇంకా పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని తెలిపింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో, ప్రపంచ చమురు వాణిజ్యంలో ఐదో వంతు జరిగే హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటించిన కొన్ని గంటల్లోనే, భారత్‌లోని ముంద్రా పోర్టుకు వస్తున్న 'ఎపామినోడాస్' అనే నౌకపై ఇరాన్ దాడి చేసింది. లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌకతో పాటు మరో షిప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతకుముందు గత శనివారం కూడా, అనుమతి పొందిన రెండు భారత నౌకలపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలీని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పిలిపించి మాట్లాడారు. భారత నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కాల్పులు జరపడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య నౌకల భద్రతకు భారత్ ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గతంలో భారత్‌కు వచ్చే నౌకలకు ఇరాన్ సురక్షిత మార్గాన్ని కల్పించిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నౌకల రాకపోకలను తిరిగి సులభతరం చేయాలని కోరినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

# భారతీయులకు ఎయిర్‌పోర్ట్ ట్రాన్సిట్ వీసా అవసరం లేదు: ఫ్రాన్స్

లండన్: భారత ప్రయాణికులకు ఫ్రాన్స్ ప్రభుత్వం ఒక ముఖ్యమైన శుభవార్తను అందించింది. ఫ్రాన్స్ మీదుగా ఇతర దేశాలకు ప్రయాణించే భారతీయులకు ఇకపై ఎయిర్‌పోర్ట్ ట్రాన్సిట్ వీసా అవసరం లేదని ప్రకటించింది. ఈ కొత్త నిబంధన ఏప్రిల్ 10 నుంచే అమల్లోకి వచ్చిందని భారత్‌లోని ఫ్రాన్స్ రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సాధారణ పాస్‌పోర్ట్ ఉన్న భారతీయ పౌరులు ఫ్రాన్స్‌లోని విమానాశ్రయాల్లో వేచి ఉండి, అక్కడి నుంచి మూడో దేశానికి ప్రయాణించేటప్పుడు ఈ మినహాయింపు వర్తిస్తుంది. అయితే, ప్రయాణికులు విమానాశ్రయంలోని అంతర్జాతీయ జోన్ దాటి బయటకు రాకూడదు. కేవలం లేఓవర్ సమయంలో ఎయిర్‌పోర్ట్‌లో ఉండే వారికి మాత్రమే ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ భారత పర్యటన సందర్భంగా, భారతీయులకు ప్రయాణ నిబంధనలు సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు.



# చైనీయులకు భారత్ పర్యాటక వీసాలు

న్యూఢిల్లీ: చైనీయులకు పర్యాటక వీసాలను భారత్ పునరుద్ధరించింది. గల్వాన్ ఘర్షణ తర్వాత గత ఐదేళ్లుగా భారత్, చైనా మధ్య పర్యాటక వీసాలు నిలిచిపోయాయి. గత కొద్దికాలంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఇందులో భాగంగా తాజాగా, ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. చైనా జాతీయులకు ఐదేళ్ల క్రితం నిలిచిపోయిన పర్యాటక వీసాలను పునరుద్ధరిస్తూ కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. మీడియా కథనాల మేరకు, పర్యాటక వీసాలపై కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే, చైనా, హాంకాంగ్ పౌరులకు పర్యాటక వీసాలు జారీ చేయడం కోసం ఈ మార్గదర్శకాలను విడుదల చేసిందని తెలుస్తోంది. దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి గత సంవత్సరం నుంచి ఆంక్షల సడలింపు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఇరుదేశాల ఒప్పందంతో విమానాల రాకపోకలను పునరుద్ధరించారు. కైలాస్ మానస సరోవర్ యాత్రను కూడా తిరిగి ప్రారంభించారు.

# టాయిలెట్‌లో బిడ్డను ప్రసవించి.. గొంతు కోసి చంపేసిన యువతి!

### బెంగళూరు ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో దారుణం

బెంగళూరు: బెంగళూరులో అమానుష ఘటన చోటుచేసుకుంది. యాపిల్ ఐఫోన్‌లను అసెంబుల్ చేసే ఫాక్స్‌కాన్ కంపెనీ ఫ్యాక్టరీలో ఓ యువతి తాను ప్రసవించిన పసికందును దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన దేవనహళ్లిలోని ఫ్యాక్టరీలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 19 ఏళ్ల రేణుక అనే యువతి టాయిలెట్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవించిన వెంటనే, బిడ్డ గొంతు కోసి హత్య చేసి, మృతదేహాన్ని ఓ బ్యాగులో పడేసింది. ఈమె అవివాహిత కావడంతో సామాజిక అవమానానికి భయపడి ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కొంతసేపటి తర్వాత టాయిలెట్‌కు వెళ్లిన మరో ఉద్యోగిని, బ్యాగులో ఉన్న శిశువు మృతదేహాన్ని చూసి భయంతో పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, విచారణ చేపట్టారు. శిశువు పుట్టిన తర్వాతే హత్యకు గురైనట్టు నిర్ధారించారు. విచారణలో నిందితురాలిని రేణుకగా గుర్తించి, ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. యువతి టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో అనుకోకుండా ప్రసవం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# ఉగ్రమూకలను అణచివేయాలి

### పాక్‌కు అమెరికా కాంగ్రెస్ సభ్యుడి సూచన


న్యూయార్క్: గత సంవత్సరం భారతదేశంలోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడితో లష్కరే తొయిబా, జైషే మహమ్మద్ వంటి సంస్థలకు సంబంధం ఉందని, ఆ ఉగ్రమూకలను పాకిస్థాన్ అణచివేయాలని అమెరికా కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ అన్నారు. భారతీయ ఎంబసీ 'హ్యూమన్ కాస్ట్ ఆఫ్ టెర్రరిజం' పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం వల్ల ప్రజలకు కలుగుతున్న నష్టాల గురించి బ్రాడ్ షెర్మన్ మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రదాడిని గుర్తు చేస్తూ, అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దారుణానికి ఒడిగట్టారని అన్నారు. మతాన్ని దృష్టిలో పెట్టుకుని దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రభుత్వానికి తాను ఒక్కటే చెప్పదలుచుకున్నానని, పహల్గామ్ ఉగ్రదాడితో సంబంధం ఉన్న ఉగ్ర సంస్థలను అణచివేయాలని పిలుపునిచ్చారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా మాట్లాడుతూ, మనమందరం కొన్ని విషయాలను గుర్తు చేసుకోవడానికి ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. ఉగ్రవాదం మన సమాజానికి అపార నష్టాన్ని కలిగిస్తుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఒక్కటై ఐకమత్యంతో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ డిజిటల్ ఎగ్జిబిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన అతిపెద్ద ఉగ్రవాదులను ప్రదర్శించారు. 1993లో జరిగిన బాంబు పేలుళ్లు, 2008లో జరిగిన ముంబై ఉగ్రదాడి, పహల్గామ్ దాడికి సంబంధించిన చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు. ఉగ్రవాదం అనే భూతాన్ని ప్రపంచం నుంచి పారద్రోలాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పిలుపునిచ్చారు.

## వయ్యారి చిత్రం



అకాంక్ష పూరి

## ఫరియా డబుల్ ట్రీట్



చిట్టి నీ నవ్వంటే లక్ష్మి పటాసే అంటూ తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకున్న ఫరియా అబ్దుల్లా ఇప్పుడు మళ్లీ హాట్ టాపిక్ గా మారింది. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆ బ్యూటీ.. తర్వాత మాత్రం పెద్దగా సక్సెస్ లు అందుకోలేకపోయింది. వరుసగా సినిమాలు చేస్తూనే ఉన్నా, ఆమె కెరీర్ లో గట్టి హిట్ మాత్రం దక్కడం లేదు. దీంతో ఇప్పుడు ఆమె నుంచి రాబోతున్న రెండు సినిమాలపై ఆసక్తి పెరిగింది. జాతిరత్నాలు సినిమాతో పరిచయమైన ఫరియా, అందులో చిట్టి పాత్రలో తన క్యూట్ యాక్టింగ్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా భారీ విజయాన్ని సాధించడంతో ఆమెకు మంచి పేరు వచ్చింది. అయితే ఆ తర్వాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. గ్లామరస్ పాత్రల్లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నా, కథల ఎంపికలో వచ్చిన లోపాలు ఆమెకు మైనస్ గా మారాయి. మత్తువదలరా 2 సినిమా కొంతవరకు పర్లేదు అనిపించినా, అది కూడా పెద్ద హిట్ గా నిలవలేదు. ఆ తర్వాత వచ్చిన గుర్రం పాపిరెడ్డి సినిమా కూడా ఫరియాకు విజయాన్ని అందించలేకపోయింది. అయినా అవకాశాలు మాత్రం తగ్గలేదు. కొత్త కథలు, కొత్త దర్శకులతో ప్రయోగాలు చేస్తూ కెరీర్ ను ముందుకు తీసుకెళ్తోంది. ఇప్పుడు ఫరియా అబ్దుల్లా ఒకేసారి రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మే 1న విడుదలకు సిద్ధమవుతున్న ఆ రెండు సినిమాలు వేర్వేరు కాన్సెప్ట్లతో రూపొందుతున్నాయి. దీంతో ఈసారి ఫరియా డబుల్ ట్రీట్ ఇవ్వనుందన్నమాట. మొదటి సినిమా గాయపడ్డ సింహం. ఇందులో తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఆ చిత్రం కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందుతోంది. అమెరికా వెళ్లాలనే కలలతో ఉన్న ఓ యువకుడి కథ నేపథ్యంలో సినిమా సాగుతుంది. ఆ మూవీ ప్రమోషన్స్ కూడా చాలా వినూత్నంగా చేస్తున్నారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీతో ట్రంప్ పాత్రను ఉపయోగించడం ఆసక్తికరంగా మారింది. మరోవైపు జెట్లీ సినిమా కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. కమెడియన్ సత్య హీరోగా నటిస్తున్న ఆ చిత్రాన్ని రితేష్ రానా తెరకెక్కిస్తున్నారు.



## తల్లి కాబోతున్న మోనాలిసా

కుంభమేళాలో పూసలు అమ్ముకుంటూ రాత్రికి రాత్రి సోషల్ మీడియా స్టార్గా మారిన మోనాలిసా భోంస్లే జీవితం ఇప్పుడు ఒక సినిమాను తలపిస్తోంది. హీరోయిన్గా ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటున్న సమయంలోనే ఆమె ప్రేమ వివాహం, ఆపై నమోదైన పోక్సో కేసు సంచలనం సృష్టించాయి. తాజాగా ఆమె గర్భవతి అనే వార్త బయటకు రావడంతో ఈ వివాదం మరో మలుపు తిరిగింది. మార్చి 11న వివాహం జరిగిన విషయం అందరికీ తెలిసిందే. పెళ్లయిన కేవలం నెల రోజుల్లోనే ప్రెగ్నెన్సీ వార్త బయటకు రావడంతో చాలామంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "ఏంటి భయ్యా.. రోజుకో ట్విస్ట్ ఇస్తున్నారు, అసలు ఇందులో నిజమెంత?" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పేలుతున్నాయి. ఈ విషయంలో పోలీసులు కూడా అలర్ట్ అయ్యారు. ఫర్మాన్ ఖాన్ చెప్పిన మాటలు నిజమా కాదా అని నిర్ధారించుకోవడానికి వైద్య పరీక్షలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. మోనాలిసా ప్రెగ్నెన్సీ వార్త నిజమైతే ఈ కేసు గమనం పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. చట్టపరంగా మైనర్ వివాహం చెల్లదు కాబట్టి, ఈ మెడికల్ రిపోర్ట్స్ ఇప్పుడు చాలా కీలకం కానున్నాయి. మరి ఈ 'వైరల్ బ్యూటీ' జీవితం ఏ తీరానికి చేరుతుందో వేచి చూడాలి. ఇక ఏదేమైనా మోనాలిసా స్టోరీలో రోజుకో షాకింగ్ న్యూస్ బయటకు రావడం మాత్రం ఆగడం లేదు.

## కల్కి2కి టైటిల్ ఫిక్స్?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ఎపిక్ సైన్స్ ఫిక్షన్ మూవీ –కల్కి 2898ఏడీ–. నాగ్ అశ్విన్ డైరెక్షన్లో వైజయంతీ మూవీస్ బ్యానర్పై అత్యంత ప్రతిష్టాతకంగా రూపొంది బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైనే వసూళ్లని రాబట్టి సీక్వెల్పై అంచనాల్ని పెంచేసింది. దీపికా పదుకునే హీరోయిన్గా నటించిన ఈ మూవీలోని ఇతర కీలక పాత్రల్లో అశ్వద్ధామగా అమితాబ్ బచ్చన్, సుప్రీం యాస్కిన్గా కమల్ హాసన్, మరియమ్గా శోభన, రూమీగా రాజేంద్రప్రసాద్ తదితరలు నటించారు. భూమిపై ప్రధాన నగరం, కలియుగాతం సమయంలో భూమిపై చివరి నగరం కాశీ నేపథ్యంలో.. శంభాల..దేవుడి ఆగమనం వంటి డివోషనల్ ఎలిమెంట్స్తో కల్కి అవతారం పుట్టక, దాని చుట్టూ జరిగిన నాటకీయ పరిణామాలని చూపిస్తూ ఓ ఫిక్షనల్ సైన్స్ థ్రిల్లర్గా దీన్ని నాగ్ అశ్విన్ తెరకెక్కించిన తీరు, సినిమా ప్రారంభంలో కురుక్షేత్ర సంగ్రామం..సినిమా చివర్లో అర్జునుడు, కర్ణుడు అశ్వద్ధామ కోసం యుద్ధం చేయడం..వంటి అంశాలని చూపిస్తూ ప్రేక్షకుల్ని ఆ నాటి కాలానికి తీసుకెళ్లింది.





## శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీకి అడ్డంకులు



పెళ్లి సందడి సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల.. అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్గా గుర్తింపు తెచ్చుకుంది. దీంతో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు అందుకుంటూ మోస్ట్ వాంటెండ్ హీరోయిన్స లిస్ట్లో చేరిపోయి బాలీవుడ్లో కూడా ఆఫర్ అందుకున్న విషయం తెలిసిందే. కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్న 'ఆషిఖీ3'లో శ్రీలీల హీరోయిన్గా నటిస్తున్నట్లు ప్రకటన కూడా వచ్చింది. అనురాగ్ బసు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం అనౌన్స్ చేసి ఇప్పటికే రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు విడుదలకు నోచుకోలేదు. ఈ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామాతో హిందీలో కూడా శ్రీలీల తన మార్క్ను సెట్ చేసుకుంటుంది అని ఎక్స్పెక్ట్ చేసి ఫ్యాన్స్కు 'ఆషిఖి 3' ఎప్పటికప్పుడు నిరాశే మిగుల్చుతుంది. ఇక ఈ ఏడాది అయిన విడుదల అవుతుందేమో అని ఆశ పడగా.. ఈ చిత్రం కేవలం 40% షూటింగ్ మాత్రమే పూర్తి చేసుకుందని దర్శకుడు అనురాగ్ బసు తాజాగా చెప్పడంతో.. ఈ ఏడాది కూడా శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ఆగినట్లే అని అర్థం అవుతుండగా.. ఫ్యాన్స్ నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రెగ్నెన్సీలోనూ దీపిక యాక్షన్ సీన్స్

అల్లు అర్జున్ హీరోగా, డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం రాకా చుట్టూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె రెండోసారి తల్లి కాబోతున్నట్లు అనౌన్స్ చేసిన తర్వాత, ఈ సినిమాకు సంబంధించి పలు వదంతులు వైరల్ అయ్యాయి. ఆమె పాత్రను తగ్గిస్తున్నారనే ప్రచారం, షూటింగ్ ఆలస్యమవుతుందనే ఊహాగానాలు వేగంగా వ్యాపించాయి. అయితే ఈ రూమర్స్పై చిత్రబృందం క్లారిటీగా స్పందిస్తూ, సినిమాలో ఎలాంటి మార్పులు లేవని, ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారమే షూటింగ్ కొనసాగుతోందని ప్రకటించింది. అయితే ఈ మొత్తం పరిణామంలో అత్యంత చర్చనీయాంశంగా మారింది ప్రెగ్నెన్సీలో కూడా దీపికా షూటింగ్ లో పాల్గొనడం. పర్సనల్ లైఫ్ లో దీపిక కీలక దశలో ఉన్నప్పటికీ, ఆమె తన వృత్తిపరమైన బాధ్యతలను అదే స్థాయిలో కొనసాగించడం పరిశ్రమలో చర్చకు దారి తీసింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో కూడా ఆమె పాల్గొంటున్నారన్న సమాచారం ఆసక్తిని పెంచుతోంది. ఈ యాక్షన్ సీన్స్ కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ షూటింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.



## విలాసాన్ క్వీన్.. సుహానా



భారతదేశంలో సంపన్న వారసురాళ్ల జీవనశైలి గురించి చర్చ వస్తే అందరి దృష్టి బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ గారాల పట్టి సుహానా ఖాన్ మీదకు వెళుతుంది. మరోవైపు ఐపీఎల్ వేదికగా తనదైన ముద్ర వేసిన సన్రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ కూడా నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. వీరిద్దరికీ ఒక పోలిక ఉంది.. అదే ఐపీఎల్ టీమ్స్. షారుఖ్కు కోల్కతా నైట్ రైడర్స్ ఉంటే.. కావ్య తన సొంత జట్టు ఎస్ఆర్హెచ్ను ముందుండి నడిపిస్తున్నారు. అయితే ఈ భామలిద్దరి లగ్జరీ కార్ల షికార్లను గమనిస్తే మాత్రం కావ్య మారన్ రేంజ్ చాలా భిన్నంగా.. అల్ట్రా లగ్జరీగా కనిపిస్తోంది. సుహానా ఖాన్ తన తండ్రి సంపదకు తగ్గట్టుగానే విలాసవంతమైన కార్లలో సందడి చేస్తుంటారు. ఆమె గ్యారేజీలో దాదాపు రూ. 1 కోటి విలువైన మెర్సిడెస్ బెంజ్ జీఎల్ఈ 43 ఏఎంజీ కూపే, రూ. 29 లక్షల ఖరీదైన జీప్ కంపాస్, తండ్రి బహుమతిగా ఇచ్చిన రూ. 70 లక్షల విలువైన ఆడి ఏ6 వంటి కార్లు ఉన్నాయి. ఇవి ఒక యువ స్టార్కి ఉండాల్సిన హై-ఎండ్ అభిరుచిని ప్రతిబింబిస్తాయి.



ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 6 | 5 | 0 | 11 |
| రాజస్థాన్ | 7 | 5 | 2 | 10 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 8 |
| హైదరాబాద్ | 7 | 4 | 3 | 8 |
| చెన్నై | 7 | 3 | 4 | 6 |
| ఢిల్లీ | 6 | 3 | 3 | 6 |
| గుజరాత్ | 6 | 3 | 3 | 6 |
| ముంబై | 7 | 2 | 5 | 4 |
| లక్నో | 7 | 2 | 5 | 4 |
| కోల్‌కతా | 7 | 1 | 5 | 3 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు



# సంజూ.. సెంచరీ!

## బౌలింగ్‌లో హోసెన్ కీ స్పెల్.. చెన్నై భారీ విజయం .. ముంబైకి ఐదో ఓటమి

**ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ మరో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వరుసగా నాలుగు పరాజయాల తర్వాత భారీ విజయంతో గాడిన పడినట్లు కనిపించిన ముంబై తర్వాతి మ్యాచ్‌లోనే చేతులెత్తేసింది. గురువారం వాంఖడే వేదికగా ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన చెన్నై సూపర్ కింగ్స్ 103 పరుగుల భారీ తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది.**

**ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ఇది ఐదో పరాజయం కాగా.. సీఎస్‌కేకు మూడో విజయం. సంజూ శాంసన్ అజేయ శతకం, అకీల్ హోసెన్(4/17) సెన్సేషనల్ బౌలింగ్ సీఎస్‌కేకు భారీ విజయాన్ని అందించాయి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగులు చేసింది. సంజూ శాంసన్(54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101 నాటౌట్) ఒక్కడే అజేయ శతకంతో చెలరేగగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.**

ముంబై బౌలర్లలో అశ్వని కుమార్(2/37), అల్లా ఘజన్‌ఫర్(2/25) రెండేసి వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా, మిచెల్ సాంట్నర్ చెరో వికెట్ తీసారు. అనంతరం ముంబై ఇండియన్స్ 19 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌటైంది. సూర్యకుమార్ యాదవ్(30 బంతుల్లో 5 ఫోర్లుతో 35), తిలక్ వర్మ(29 బంతుల్లో 5 ఫోర్లతో 37) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. డానిష్ మలెవర్(0), నమన్ ధీర్(0), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్(0) డకౌట్ కాగా.. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో అకీల్ హోసెన్(4/17) నాలుగు వికెట్లతో ముంబై ఇండియన్స్ పతనాన్ని శాసించగా.. నూర్ అహ్మద్(2/23) రెండు వికెట్లు పడగొట్టాడు. ముఖేష్ చౌదరీ, అన్షుల్ కంబోజ్, జెమీ ఓవర్టన్, గుర్జప్నీత్ సింగ్ తలో వికెట్ తీసారు. చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లలో సంజూ శాంసన్ మినహా మరే బ్యాటర్ చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేదు. దాంతో సీఎస్‌కే 207 పరుగులకే పరిమితమైంది. ఈ 208 పరుగుల లక్ష్యాన్ని ముంబై ఇండియన్స్ ఈజీగా ఛేజ్ చేస్తుందని అంతా అనుకున్నారు. కానీ తొలి ఓవర్‌నే స్పిన్నర్ అకీల్ హోసేన్‌తో వేయించి రుతురాజ్ గైక్వాడ్ ఫలితాన్ని రాబట్టాడు. డానిష్ మలేవార్(0)ను అకీల్ డకౌట్ చేయగా.. సిక్సర్‌తో జోరు కనబర్చిన క్వింటన్ డికాక్(7)ను ముఖేష్ చౌదరీ పెవిలియన్ చేర్చాడు. తన మరుసటి ఓవర్‌లో నమన్ ధీర్(0)ను అకీల్ హోసేన్ డకౌట్ చేసి ముంబై పతనాన్ని శాసించాడు. మూడు ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోవడంతో ముంబై బ్యాటర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. దాంతో పవర్ ప్లేలో ముంబై 3 వికెట్లు కోల్పోయి 29 పరుగులే చేసింది. ఇక్కడే మ్యాచ్ సీఎస్‌కే వశమైంది. సూర్య, తిలక్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేసినా.. ఛేదించాల్సిన రన్‌రేట్ పెరుగుతుండటంతో వారిపై ఒత్తిడి పెరిగింది. మిడిల్ ఓవర్లలో మరోసారి బౌలింగ్‌కు దిగిన అకీల్ హోసేన్ సూర్య, తిలక్ వర్మలను పెవిలియన్ చేర్చి ముంబై పతనాన్ని శాసించాడు. ఆ తర్వాత ముంబై ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. ముంబై ఇండియన్స్ బ్యాటింగ్‌పై ఆ జట్టు అభిమానులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ఆటరా అయ్యా అంటూ మండిపడుతున్నారు.



## సంజూ సెంచరీల వేట

చెన్నై సూపర్ కింగ్స్ ఓపెనర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ముంబై ఇండియన్స్‌పై సెంచరీ బాదిన తొలి సీఎస్‌కే బ్యాటర్‌గా నిలిచాడు. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ సీఎస్‌కే బ్యాటర్ కూడా ముంబైపై శతకం నమోదు చేయలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా వాంఖడే వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్(54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101 నాటౌట్) సెంచరీ చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. తనదైన నిశ్శబ్ద శైలితో క్రీజులోకి అడుగుపెట్టిన చెటా.. ఆ తర్వాత గేర్లు మార్చి ప్రత్యర్థి బౌలింగ్‌ను విచ్ఛిన్నం చేశాడు. పవర్ ప్లేలో గ్యాప్ షాట్స్‌తో బౌండరీలు బాదిన సంజూ.. మిడిల్ ఓవర్లలో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి సిక్సర్ బాది సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌తో సంజూ శాంసన్ ఒకటి కాదు.. రెండు కాదు ఐదు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

### 1. రోహిత్ రికార్డ్ సమం

ఈ సీజన్‌లో సంజూ శాంసన్‌కు ఇది వరుసగా రెండో సెంచరీ కాగా.. ఓవరాల్‌గా 8వ టీ20 సెంచరీ. దాంతో పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు బాదిన భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ రికార్డ్‌ను సంజూ శాంసన్ సమం చేశాడు. ఈ జాబితాలో 9 సెంచరీలతో విరాట్ కోహ్లీ, అభిషేక్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. సంజూ శాంసన్ 8 శతకాలతో రోహిత్ శర్మ సరసన నిలిచాడు. ఈ సీజన్‌లో మరో శతకాలు బాదితే కోహ్లీ రికార్డును కూడా సంజూ బద్దలు కొట్టనున్నాడు.

### 2. ఒకే సీజన్‌లో రెండు సెంచరీలు

ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున రెండు సెంచరీలు బాదిన రెండో బ్యాటర్‌గా సంజూ శాంసన్ రికార్డు సాధించాడు. 2018లో షేన్ వాట్సన్ మాత్రమే సీఎస్‌కే తరపున ఒకే సీజన్‌లో రెండు సెంచరీలు నమోదు చేశాడు.

### 3. ముంబైపై శతక్కొట్టిన తొలి సీఎస్కే బ్యాటర్

ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్‌పై సెంచరీ బాదిన ఏకైక సీఎస్‌కే బ్యాటర్ సంజూ శాంసన్ మాత్రమే. ఎందరో దిగ్గజాలు సీఎస్‌కే తరపున ఆడినా.. ముంబై ఇండియన్స్‌పై సెంచరీ సాధించలేకపోయారు. ఆ లోటును తాజా శతకంతో సంజూ తీర్చాడు.

### 4. రాహుల్ రికార్డ్ సమం

ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సెంచరీలు నమోదు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో సంజూ శాంసన్ తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. సంజూకు ఇది ఐదో ఐపీఎల్ సెంచరీ. దాంతో కేఎల్ రాహుల్(5) రికార్డును సంజూ సమం చేశాడు. ఈ జాబితాలో 8 శతకాలతో కోహ్లీ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. జోస్ బట్లర్(7), క్రిస్ గేల్(6) శాంసన్ కంటే ముందున్నారు.

### 5. సీఎస్‌కే క్లబ్‌లో సంజూ

చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ తరపున ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు బాదిన ఆటగాళ్ల జాబితాలో సంజూ చేరాడు. మురళీ విజయ్ (2), షేన్ వాట్సన్ (2), రుతురాజ్ గైక్వాడ్ (2) తర్వాత సీఎస్‌కే తరపున రెండు శతకాలు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచాడు.

## సెంచరీ కోసం కాదు.. జట్టు కోసం ఆడాను: సంజూ

తాను జట్టు కోసమే ఆడితే సెంచరీ రివార్డ్‌గా లభించిందని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ సంజూ శాంసన్ తెలిపాడు. వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు గెలుపే తనకు ముఖ్యమని మరోసారి స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా వాంఖడే వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన చెన్నై సూపర్ కింగ్స్ 103 పరుగుల భారీ తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. సంజూ శాంసన్(54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101 నాటౌట్) అజేయ శతకంతో సీఎస్‌కే విజయంలో కీలక పాత్ర పోషించాడు. దాంతో అతనికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మాట్లాడిన సంజూ శాంసన్.. వరుసగా వికెట్లు కోల్పోవడంతో చివరి వరకు బాధ్యతగా ఆడాలనుకున్నాని తెలిపాడు. 'వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌పై సెంచరీ చేయడం చాలా సంతోషంగా ఉంది. నేను కేవలం పరిస్థితులను గమనిస్తూ ఆడాను. ఆరంభంలో బంతి స్వింగ్ అవుతూ, కాస్త ఆగుతూ వచ్చింది. పవర్‌ప్లే తర్వాత మేం వరుసగా వికెట్లు కోల్పోయాం. దాంతో క్రీజులో సెట్ అయిన నేను చివరకు ఆడాలని నిర్ణయించుకున్నా. మనం ఏం చేయాలో ఆటనే మనకు చెబుతుంది. ముందుగానే ఊహించుకుని ఆడాల్సిన అవసరం లేదు . నాకు జట్టు గెలుపే తొలి ప్రాధాన్యత. నాకున్న అనుభవంతో ఆటను అర్థం చేసుకున్నాను. మాది యువ జట్టు.. కానీ వరుసగా మూడు ఓటముల తర్వాత మేం చూపించిన పోరాటం అద్భుతం. మాకు ప్రతీ మ్యాచ్ ముఖ్యమే. మేం అన్ని మ్యాచ్‌లకు సిద్ధంగా ఉండి ఆటను ఆస్వాదించాలి. వాంఖడేలో ఇంతలా పసుపు జెర్సీలు కనిపిస్తుండటం నాకు చాలా కొత్తగా ఉంది.'అని సంజూ శాంసన్ తెలిపాడు.






## ఐపీఎల్ అంటే వారికి టైంపాస్ టూర్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్).. వరల్డ్ బెస్ట్ క్రికెట్ లీగ్. ఆట, ఆదరణ, ఆదాయం ఎలా చూసుకున్న ఐపీఎల్‌కు సరితూగే ఫ్రాంచైజీ లీగ్ మరొకటి లేదు. అందుకే ఈ క్యాష్ రిచ్ లీగ్ ఆడేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లు పరితపిస్తారు. కనీసం ఒక్క సీజన్ అయినా ఆడాలనే కలలు కంటారు. అంతలా ప్రపంచవ్యాప్తంగా ఐపీఎల్‌కు క్రేజ్ ఉంది. డబ్బుకు డబ్బు.. ఆటకు ఆట.. గుర్తింపుకు గుర్తింపు దక్కే ఏకైక లీగ్ ఐపీఎల్. ఈ లీగ్ ద్వారా ఎంతో మంది అనామక ఆటగాళ్లు రాత్రికి రాత్రే స్టార్లు అయ్యారు. ఎందరో స్టార్ ఆటగాళ్లు పేలవ ప్రదర్శనతో పత్తాలేకుండా పోయారు. రెండున్నర నెలలు యావత్ క్రికెట్ ప్రపంచం ఐపీఎల్ మత్తులో మునిగి తేలుతోంది. రాత్రి 7 అయ్యిందంటే చిన్నా పెద్ద అందరూ మొబైల్స్ కో.. టీవీ స్క్రీన్స్ కో అతుక్కుపోయి మ్యాచ్‌లు చూస్తున్నారు. అంతలా ఆదరణ పొందిన ఈ లీగ్‌ను కొందరు విదేశీ ఆటగాళ్లు ఒక టైంపాస్ పల్లి బఠాణీ యవ్వారంలా చూస్తున్నారు. హాలిడే వేకేషన్‌లో ఫ్యామిలీతో ఐపీఎల్‌కు వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. అయినా ఈ ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల రూపాయాలను తగలేస్తున్నాయి. గత 19 ఏళ్లలో కొందరు విదేశీ ఫ్లాప్ ఆటగాళ్లు మన ఫ్రాంచైజీల దగ్గర దోచుకున్న డబ్బులు చూస్తే మన దేశ ఆర్థిక నేరగాళ్లు ఎంతో నయం. అన్ని సీజన్లలో కలిపి గ్లేన్ మ్యాక్స్‌వెల్ ఒక్కడే సంపాదించిన డబ్బు అక్షరాల రూ.145 కోట్లు. అతను ఆడింది మాత్రం సున్నా. ఐపీఎల్ 2014 మినహా అతను ఏ సీజన్‌లోనూ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. ప్రతీ ఏడాది భారత్‌కు వచ్చి టైంపాస్ చేసి వెళ్లి పోయాడు. అతని తీరుకు విసిగిపోయిన ఫ్రాంచైజీలు దూరం పెట్టేసాయి. మ్యాక్స్‌వెల్ టైంపాస్ వ్యవహారం గురించి గతంలోనే వీరేంద్ర సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అతన్ని కొనుగోలు చేయవద్దని ఫ్రాంచైజీలకు నెత్తి నోరు కొట్టుకొని మరి చెప్పాడు. మ్యాక్స్‌వెల్ తర్వాత లియం లివింగ్ స్టోన్ రూ.60 కోట్లు, క్రిస్ మోరిస్ రూ.80 కోట్లు, బెన్ స్టోక్స్ 80 కోట్లు దోచుకున్నారు. వీరే కాకుండా ఎందరో ఆటగాళు సీజన్ సీజన్‌కు వచ్చి కోట్ల రూపాయలను కొల్లగొట్టారు. ఏబీ డివిలియర్స్, సునీల్ నరైన్, డేవిడ్ వార్నర్ వంటి ఆటగాళ్లు ప్రాణం పెట్టిన ఆడినా.. మిగతా ప్లేయర్లు మాత్రం టైంపాస్ చేసి డబ్బులు ఏసుకుపోయారు. మనీ వర్సెస్ పర్ఫామెన్స్ ఆధారంగా విదేశీ ఆటగాళ్లలో మోస్ట్ సక్సెఫుల్ ప్లేయర్ ఎవరా? అంటే ఏబీ డివిలియర్స్, రషీద్ ఖాన్ అని చెప్పవచ్చు.

### ఐపీఎల్ 2026 సీజన్ వరకు అత్యధికంగా సంపాదించిన విదేశీ ఆటగాళ్ల జాబితా

1. ఏబీ డివిలియర్స్ రూ.100-105 కోట్లు
2. సునీల్ నరైన్- రూ. 135 ప్లస్ కోట్లు
3. ఆండ్రీ రస్సెల్-రూ.100 ప్లస్ కోట్లు
4. గ్లేన్ మ్యాక్స్‌వెల్- రూ. 145 కోట్లు
5. డేవిడ్ వార్నర్ రూ.100 కోట్లు
6. కీరన్ పోలార్డ్-రూ.95 ప్లస్ కోట్లు
7. లసిత్ మలింగా-రూ.48 ప్లస్ కోట్లు
8. బెన్ స్టోక్స్- రూ.75 ప్లస్ కోట్లు
9. క్రిస్ మోరీస్- రూ.80 ప్లస్ కోట్లు
10. రషీద్ ఖాన్- రూ.120 ప్లస్ కోట్లు




## నైట్‌రైడర్స్ స్టేడియంలో ఒలింపిక్స్ క్రికెట్ పోటీలు

శతాబ్దకాల నిరీక్షణ అనంతరం లాస్‌ఏంజెల్స్‌లో జరుగబోయే 2028 ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకున్న క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేసే పనులకు ఐసీసీ శ్రీకారం చుట్టింది. ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లను ఆడించేందుకు గాను కాలిఫోర్నియాలో పొమొనలో ఉన్న నైట్‌రైడర్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఇందుకోసం సిద్ధం చేస్తున్నది. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ యజమానిగా ఉన్న లాస్ ఏంజెల్స్ నైట్‌రైడర్స్ జట్టు.. అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)లో తమ హోంమ్యాచ్‌లను ఇక్కడే ఆడింది. ఇదే వేదికపై విశ్వక్రీడల్లో క్రికెట్ పోటీలను నిర్వహించనున్నారు. ఇందుకు గాను ఈనెల 22న మైదానాన్ని పునర్నిర్మించే పనులకు ఐసీసీ శ్రీకారం చుట్టింది. ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజోగ్ గుప్తా, నైట్‌రైడర్స్ సీఈవో వెంకీ మైసూర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 24-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

## ఆర్టీసీ కార్మికుల్లో అసంతృప్తి

తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు మరోమారు సమ్మె బాట పట్టడం రాష్ట్ర రవాణా వ్యవస్థలో నెలకొన్న తీవ్ర అసంతృప్తిని సూచిస్తోంది. ప్రజా రవాణాకు వెన్నెముకగా నిలిచే ఆర్టీసీని కాపాడుకోవడంలోనూ, అందులో శ్రమించే వేలాది మంది కార్మికుల ప్రయోజనాలను రక్షించడంలోనూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు 32 డిమాండ్లతో సమ్మెకు దిగారు. ఆ డిమాండ్లలో 29 అంశాలపై సానుకూలంగా ఉన్నామని చెబుతోంది. సమస్యల పరిష్కారానికి అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని నియమించి, నాలుగు వారాల గడువు కోరింది. అయితే, ఇది కేవలం కాలయాపన చేసే ఎత్తుగడ అని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆర్థికంగా సుమారు రూ.32,000 కోట్ల భారం పడే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతుండగా, కార్మికులు తమ ప్రాథమిక హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికులకు మద్దతు తెలపడం, అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపడం ఒక ఆనవాయితీగా మారింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన కఠిన వైఖరిని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు, బీజేపీ మరియు సీపీఐ వంటి పార్టీలు కార్మికులకు మద్దతుగా నిలుస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. సమ్మె వల్ల సామాన్య ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు మరియు పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా, సామరస్య పూర్వక చర్చల ద్వారా ప్రభుత్వం ఒక కచ్చితమైన పరిష్కారాన్ని చూపాలి. కార్మికుల సంక్షేమం మరియు ప్రజల సౌకర్యం రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయమిది.



## తడియారని అమ్మ కొంగు!

దాచుకున్నప్పుడల్లా
అమ్మ కొంగు తడిగానే తగిలేది
అది చెమట సుగంధంతోనో
చెప్పుకోలేని దుఃఖంతోనో!

ఆమె కళ్ళను మీనాలతో పోలిస్తే
నేనంత లోతుగా ఊహించలేదు
అవి ఎన్నడూ ఇంకిపోని
కన్నీటి జలసంద్రాలని!

ఈ ప్రపంచమంతా
ఆమె రక్త మాంసాలతో నిర్మితమైనా
దుఃఖమంటని తీరం
ఆమె కనుచూపుమేర కానగరాదు!

ఉన్మాదులు యుద్ధం చేస్తున్నారు
ప్రపంచానిది ఇప్పుడు వీక్షక పాత్ర
పసికూనల దుర్మరణానికి
అమ్మ ఒక్కతే కన్నీరుమున్నీరవుతున్నది!

విసిగి అమ్మ కొంగు పిండి
ఈ ప్రపంచం మీద ఆరేసుకున్ననాడు
బహుశా ఈ భూగోళం
ఆ దుఃఖ సముద్రంలో జల సమాధే!

నేను పోతూ పోతూ
దుఃఖ మెరుగని తల్లినొకదానిని
తనివి తీరా చూస్తూ చూస్తూ
ఆవలి తీరం చేరాలని ఉంది!!

– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

# అస్తిత్వ నినాదానికి ఆసరా అసిపె

**వేదన తీరాన్ని ఈదిన వేదికకు అస్తిత్వ అంగడిలో గొంగడి పరుచుకున్న సబ్బండవర్ణాల సాగుబాటుకు నెత్తురు తడిలో పాదులు పెట్టిన కులవృత్తుల కుత్తుకలు,ఎండిన చేనుగా దర్శనమిచ్చిన వేళ,పల్లె సంస్కృతి దృశ్యంకు అద్దం పట్టిన వనపట్ల సుబ్బయ్య గారి అక్షరాయుధమే అసిపె దీర్ఘకావ్యం.**



గన్నోజు ప్రసాద్
9491617161
పుస్తక సమీక్షకుడు

రక్తం కమిలిన చేతుల్లో రంగుల హరివిల్లులకు కరువొచ్చింది.ఆకలి మంటలు పుట్టిన నేలలో బతుకు జీవుడు గుప్పెడు మెతుకులకై అలమటిస్తుంటే,కులవృత్తి నేర్పిన కుస్తీలో వొడవని చరిత్రను ఓపికతో దిద్దుకొనుటకు, కత్తిని కలంగా మలుచుకొని బహుజన వాదాన్ని భుజానేసుకుని తిరిగిన 'ఆసిపె' కత్తుల పెట్టే కాదు,స్వాభిమానాన్ని విడిచిపెట్టని సామ్యవాద నెలపొడుపు కూడా!

**అగ్రవర్ణాల కొట్టులో
బహుజనుల జాతకం తాకట్టు
పెట్టబడి, తెలంగాణ పల్లె
సంస్కృతిలో బువ్వ కుండ కాడ
చిల్లిన మెతుకుల్లా చిందరవందరగా
ఉన్న సబ్బండవర్ణాలకు ఐకమత్య
జెండాను ఊపి ఆయుష్షు పోసిన
కావ్యంగా చరిత్రలో నిలించింది
వనపట్ల వారి అసిపె.**

దీర్ఘ కవితల్లో ఒకే వస్తువును విషయ సూచికగా తీసుకొని, దాని చుట్టూ పరిభ్రమించే అనేక అంశాలను, సామాజిక కోణాలను శిబ్బి తీగల్లా అల్లుకుని పాయలు పాయలుగా భావోద్వ్యజ్ఞతను నొక్కి చెప్పుతూ,కోల్పోయిన చరిత్ర ఆనవాళ్లనూ, కొప్పు శిఖరంగా చేస్తూనే, ఆత్మగౌరవ నినాదాన్ని, రాజకీయ అవగాహనా ఆవశ్యకతను విప్పి చెపుతున్నవి.ఈ విషయంలో అసిపె కావ్యం ముందు వరసలో నిలిచింది. ఇది మంగలి వృత్తికి సంబంధించిన అంశమే అయినా దానిలో దాగిన సున్నితత్వపు చురక,పాఠక హృదయాన్ని ఆకట్టుకుంటుంది. మొత్తం 25 భాగాల్లో సాగిన ఈ కవిత తన తండ్రి పనికి పాలేరుగా మారి, ఊరును బాగుపరచుటకు తపన పడ్డతీరు దుఃఖవర్షమైనది.

**మా ఊరిల
కోడికూత
మా నాయన కత్తి నూట
రెండొక్కటే సారి అంటూ చేతిలోని
కత్తి,కడమ కులాలకు మేలుకొలుపు
రాగమే అనీ చెప్పుతూ సంకన
అసిపెతో/మంగలి బాలయ్య/ పల్లెకు
వెలుగు/ ఊరుకు అందం/
నాగరికతకు తొలిపొద్దు అనీ
వాక్యాన్ని ఎత్తుకొని ఊరును
ఊరంతా తన చుట్టూ తిప్పుకున్న
పొద్దు తిరుగుడు పువ్వుగా తండ్రిని
అభివర్ణిస్తూ, శ్రమ సౌందర్యాన్ని
చాటాడు సుబ్బయ్య.**

గ్రామాల్లో మంగలి కులస్తుల పాత్ర వెలకట్టలేనిది. వారు లేని నేల నిజంగా చీకట్లు అల్లుకున్న ఆకాశమే.

ఒక్కనాడు మా అయ్య ఊరికోతే
గుంటుక కొట్టని సెల్క
బీట్ల గలిసినట్లు
గడాలన్నీ వడ్ల దాతి కాడ కుప్పైనట్లు...
ఒక్క దినం సవురాలు చేయక పోతే,
బాయిల నీళ్లు మల్కబడ్డట్లే అంటూ...ఊరు చింపిరి జుట్టుతో కలతప్పి కనబడుతదని తన అనుభవ జ్ఞాపకాలను మనతో పంచుకుంటాడు.కాలాన్ని కత్తెరగా మలుచుకుని ముని వేళ్ళతో ముంగురులను సదిరిన నాయన పనితనం ఆయన లేనప్పుడు ఊరును చూసి ఉద్వేగాలను ఆపుకోలేక అక్షరాల సాళ్లను ఇలా అసిపె లో అద్దిండు.

ఈ కావ్యం ఆత్మగౌరవ పతాకాన్నీ భుజాన మోస్తుందనడానికి సందేహం లేదు. అసిపనే మా ఇంటికి బువ్వ/బతుకు బండి/ మా జాతి జీవకర్ర/వెనుగర్ర/ ఆత్మగౌరవ పతాక/ కులవృత్తికి కూరాడు అనీ తన దోసిల్లతో తడిమి తండ్రికి బాసటగా నిలిచి,ఇప్పటికీ బతుకు జీవికపైన నాయన నేర్పిన పాఠమే వల్లిస్తున్నాడు వనపట్ల సుబ్బన్న.

శాస్త్ర విజ్ఞానం కరువైన పల్లెలో మంగలి స్త్రీల పాత్ర మరుపుకురానిది.మంత్రసానిగా ఊరు కాన్పులను ఎల్లదీసిన అమ్మను తలుచుకుంటూ,అమ్మ లోకానికి పుట్టుకనిస్తే మంత్రసాని అమ్మల లోకానికి పురుడు పోస్తదనీ గొప్ప విగ్రహ వాక్యాన్ని గూర్చి ఇప్పుడు కాన్పులు అంటే కత్తి కోతలు, అద్దె గర్భాలు, టెస్ట్ ట్యూబ్ లే అనీ వేదిక నెక్కిన విజ్ఞానం మీద తన కత్తి అసహనాన్ని ప్రదర్శింప చేసింది.

సబ్బండ వర్ణాలకు జాతరగా నిలిచిన కమ్మరి కొలిమిని తలుస్తూ సబ్బండ వృత్తుల పనిముట్లను పొదిగే విశ్వకర్మలు,కమ్మరి కొలిమి లేకపోతే మా చేతుల కత్తులు కత్తెర్లు లేవు. కత్తి కత్తర్లే మా పనికి కండ్లు చేతులు అనీ నిలువ నీడనిచ్చిన కమ్మరి కొలిమిని కండ్ల నిండా తలుచుకుంటాడు. కృతజ్ఞతాపరుడై కాలమెల్లా చెప్పుకుంటాడు. వాళ్ల కన్నీటి గోసలో ఆసరాగా నిలిచిన మంగలి వృత్తి, మహిమను మంచి పదాల చాంతాడును పేని,సలువ కోసం ఊట బావిలో చెమట నీళ్లను తోడేత్తిపోస్తాడు.చర్మకారుల శ్రమ సౌందర్యాన్ని మెడకు ధరించిన తోలు సంచిలో పెట్టుకొని లోకమెల్ల తిప్పుతూ అరమరికలు లేని అన్నదమ్ములం మేమనీ నేతితో గాయాలను మాన్పుతాడు.

మంగలి కత్తులకు మైల లేదు
కత్తులు చేసేదే మైల పని
మాల మాదిగలని తాకిన కత్తులతో
మాకు క్షవరం చేయొద్దని అగ్రకుల
వెలివేతలు
కత్తికి వాడకు మధ్యన లక్ష్మణ రేఖలు...

బలిసిన నోరు మంగలోడా అని అరిచిన చోటలో,ఓర్పు సహనాలను పాటించి, వాళ్లను మహాత్ములుగానే చూసి, మనసున ఉడికిన నిట్టూర్పులను దిగమింగుకున్నాడే తప్ప




తిరగబడలేదని వాక్యం రాసినప్పటికీ, అంటు ముట్టులకు ఆదిదేవతలం మేమే అని మనసుకు సర్ది చెప్పుకున్న అసిపె, అన్ని కులాల కడగండ్లను తడిమి, అంటరానితనాన్ని కూడా ఆవలింతలుగా నెట్టి సామాజిక చైతన్య వెలుగును ఆకాంక్షించింది.

క్షవరం వృత్తిలో మంగలి వారు పడ్డ పాట్లు కంటి ముందు కదలాడినట్లుగా దృశ్యస్వప్నం చేసిన అసిపె,చివరికి వచ్చేసరికి స్వాతంత్ర పోరాటంలో సత్యాగ్రహులై,రైతాంగ పోరాటంలో సమిధలుగా మారిన మేము వెనకటి చరిత్రను ఎత్తుకున్న మా భుజాలు కాయలు కాసినవనీ, నిన్న మొన్నటి తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మెలో మేము సైతం అంటూ సెలూన్ డబ్బాలను మూసి అర్ధాకలితో ఉద్యమం చేతబట్టి,ఉప్పెనలా కొట్లాడి తెలంగాణ పౌరుషాన్ని చూపడంలో మా పాత్ర గణనీయమంటూ గలాన్ని విప్పింది. ఫ్యాషన్ డిజైన్లు మమ్ము మాటిమాటికి వెక్కిరిస్తే కులవృత్తిని వదిలి దొరికిన పనల్లా చేసుకుంటూ బతికీడుస్తున్న మాకు పార్లమెంట్ మెట్లమీద అడుగు పెట్టాలని ఆకాంక్షను వెలిబుచ్చింది.బీసీ కులాలన్నీ ఒకే కుల రైలు భోగిలై కదలాలి, ఆత్మగౌరవ పోరాటంతో కలిసి నడుద్దాం అంటూ రాజకీయ చైతన్యాన్ని నొక్కి చెప్పింది.

సుదీర్ఘంగా సాగిన ఈ దీర్ఘకావ్యం గాయాలకు వెన్నపూసలా, గతాన్ని తవ్విన వర్తమానపుకవిత్వ వెలుగుగా, మరెన్నో దీర్ఘ కవితలకు ఊతమిచ్చి ముందు నడుస్తుంది. ఈ ప్రయత్నంలో వనపట్ల సుబ్బయ్య సఫలీకృతుడయ్యాడని మనం అనుకోవచ్చు. బహుజన వాదానికి పెద్దపీట వేసి ముందుకు నడుస్తున్న పెద్దన్న సుబ్బయ్యకు ఈ సందర్భంగా అభినందనలు.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010.